

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 322 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : చిత్తూరు | గురువారం 26 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE 322 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : CHITTOOR | THU 26 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

ఏఐ అదుపు తప్పితే.. ఆపడం ఎవరి వల్లా కాదు!



- కిల్ స్విచ్ కూడా సరిపోదన్న ఓపెన్ఏఐ మాజీ డైరెక్టర్..
- చెర్నోబిల్ తరహా విపత్తుపై మరో నిపుణుడి హెచ్చరిక
- విదేశీ కంప్యూటింగ్ వ్యవస్థల్లో ఏఐలపై నియంత్రణ అసాధ్యమని ఆందోళన
- అమెరికా, చైనా కలిసి పనిచేయకపోతే పెను ప్రమాదమని వెల్లడి
- ఏఐతో 'చెర్నోబిల్' తరహా మహా విపత్తు పొంచి ఉందన్న హింటన్
- ఆర్థిక, పవర్ గ్రిడ్ వ్యవస్థలను ఏఐ స్తంభింపజేసే ప్రమాదం

- మిగతా 2లో

పుట్టిన ప్రదేశంపై స్పష్టత ఇవ్వండి.. సౌరవ్‌దాస్‌కు కేంద్రం నోటీసులు



పెన్ పవర్ డెస్క్: కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్‌కు సంబంధించి తన పాస్‌పోర్టులో పేర్కొన్న పుట్టిన ప్రదేశం వివరాలపై వ్యత్యాసాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయంపై భద్రతా సంస్థల నుంచి నివేదికలు అందాయని.. ఈ నేపథ్యంలోనే ఆయనకు చెన్నైలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు విదేశాంగ

- మిగతా 2లో

సీఐఏనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

అమెరికా నిఘా కోటలో కలకలం..

- ఆర్టెక్స్ ఏఐ టూల్‌తో సైబర్ దాడి జరిగినట్లు అనుమానాలు..
- బహిరంగ సమాచారాన్ని తస్కరించిన హ్యాకర్లు

- మిగతా 2లో





- ఏపీ వ్యాప్తంగా తొలి విడత స్థానిక ఎన్నికల పోలింగ్
- గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్
- పంచాయతీ ఎన్నికల ఫలితాలు నేడు సాయంత్రానికే వెల్లడి
- నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లోనూ నేడు ఎన్నికలు
- పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు నవంబర్ 30న నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లో (గురువారం, నవంబర్ 26) ఎన్నికల సందడి నెలకొననుంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓటు పండుగ వాతావరణం కనిపించనుంది. పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 26 జిల్లాల పరిధిలోని 201 మండలాల్లో పంచాయతీ ఎన్నికలతో పాటు, గతంలో వివిధ కారణాలతో వాయిదా పడిన 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలకు రేపు ఉదయం నుంచే పోలింగ్ ప్రారంభం కానుంది.

- మిగతా 2లో

ఏపీ సొంత రాబడి పెరిగింది..

ఆదాయార్జన శాఖలపై చంద్రబాబు కీలక సమీక్ష



- రాష్ట్ర సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి నమోదు
- ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు
- నవంబర్ 23 నాటికే 58 శాతం వార్షిక లక్ష్యం పూర్తి
- వాణిజ్య, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో పెరిగిన రాబడి
- పన్నుల పరిశీలన, ఆడిట్‌లలో ఏఐ సాంకేతికత వినియోగం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆదాయార్జన శాఖల పనితీరు, రాబడి వృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, పరిపాలనా సంస్కరణలు, క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయానికి నమోదైన రూ.62,604 కోట్లతో పోలిస్తే ఇది రూ.11,738 కోట్లు అధికమని, మొత్తంగా 18.7 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా 2లో

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

పెట్టుబడుల రక్షణ చట్టంపై బిల్లు పెట్టే అవకాశం



- ఏపీ శాసనసభ శీతాకాల సమావేశాలకు డేట్ ఫిక్స్
- పెట్టుబడుల రక్షణ చట్టం' బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం
- రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా పరిశ్రమలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇటీవల సీఐఐ సదస్సులో భారీ పెట్టుబడుల ఒప్పందాల నేపథ్యంలో కీలక అడుగు

- మిగతా 2లో

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు.. కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..





పెన్ పవర్ డెస్క్:కాకినాడ జిల్లా ఉప్పాడ మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 19న సముద్రంలో గల్లంతయ్యారని ప్రకటించారు కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కోస్ట్‌గార్డ్ అధికారులకు తెలియజేసిందని అన్నారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 18వ తేదీన ఒడిశాలోని పారాదీప్ పోర్టు

- మిగతా 2లో

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

- త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమన్న కవిత
- టీఆర్ఎస్ పార్టీ ఆదరణ చూసి ఓర్వలేకే తనపై దాడులు చేస్తున్నారని వ్యాఖ్య
- ఇప్పటికే తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని ఆవేదన

- మిగతా 2లో





భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

25 శాతం వరకు సుంకాల ముప్పు!

- వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతానికి తగ్గే అవకాశం..
- భారత్ సహా 14 దేశాలపై అమెరికా ప్రతిపాదన
- అధిక పారిశ్రామిక ఉత్పత్తి అమెరికా మార్కెట్‌ను దెబ్బతీస్తోందన్న వాషింగ్టన్
- ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం జనవరి నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్

- మిగతా 2లో

నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

10 లక్షల మందితో 'మైటీడీపీ' అతిపెద్ద మైలురాయి

- మైటీడీపీ యాప్‌లో నమోదైన కార్యకర్తల సంఖ్య పది లక్షలకు చేరిక
- పార్టీతో కార్యకర్తలను నేరుగా అనుసంధానించేందుకు సరికొత్త సాంకేతికత
- క్షేత్రస్థాయిలో కష్టపడే శ్రేణులకు గుర్తింపునిచ్చేలా నారా లోకేశ్ సూచనలతో ప్రత్యేక వ్యవస్థ
- అభిప్రాయ సేకరణతో పాటు పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణకు డిజిటల్ వేదిక
- నరసరావుపేట, కుప్పం సహా పలు నియోజకవర్గాల్లో యాప్ వినియోగం ముందంజ

- మిగతా 2లో





జగన్ సీఎం పదవి అడిగారు.. సోనియా నో చెప్పారు!

- జగన్ కాంగ్రెస్‌ను వీడటంపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు..
- వెన్నుపోటుదారుడు ఎవరు?' అంటూ ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై సంచలన ఆరోపణలు చేశారు. జగన్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఈ మేరకు రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ

- మిగతా 2లో



భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది.అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు. మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో డంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి.అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ సుంకాలు అమల్లోకి రావచ్చని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.గతంలో ట్రంప్ ప్రభుత్వం విధించిన గ్లోబల్ టారిఫ్‌లను చెల్లవంటూ, అధ్యక్షుడికి ఆ విధమైన చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని నెలలకే ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఆటోమొబైల్స్, స్టీల్ వంటి నిర్దిష్ట రంగాలపై మాత్రమే ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి.

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు..
కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..

- మొదటి పేజీ తరువాయి

సమీపంలో కనిపించినట్లు ప్రాథమికంగా గుర్తించారని... ఆ తరువాత వారు ఫోన్ ద్వారా గానీ, ట్రాన్స్‌పాండర్ ద్వారా గానీ ఎలాంటి సమాచారం అందుబాటులోకి రాలేదని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైనట్లు సమాచారం అందిన వెంటనే కాకినాడ కోస్ట్‌గార్డ్ అధికారులు తక్షణమే స్పందించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారని తెలిపారు.

కోస్ట్ గార్డ్, నేవీ అధికారుల సంయుక్త గాలింపు:

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులు సంయుక్తంగా విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. యుద్ధ నౌకలు, హెలికాప్టర్లతో సముద్రం లో నిరంతరాయంగా గాలింపు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని బంగ్లాదేశ్, మయన్మార్ నేవీ అధికారులతో కూడా పంచుకున్నట్లు తెలిపారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా తిరిగి వస్తారని... వారి ఆచూకీ లభించే వరకు సంబంధిత అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను కొనసాగించనున్నట్లు తెలిపారు కలెక్టర్.

ఏఐ అదుపు తప్పితే..
ఆపడం ఎవరి వల్లా కాదు!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను విధ్వంసకర శక్తుల చేతుల్లోకి వెళ్లినా లేదా నియంత్రణ కోల్పోయినా దాన్ని ఆపడానికి ఎలాంటి 'కిల్ స్విచ్' (ఎమర్జెన్సీ షట్‌డౌన్) పనిచేయదని ఓపెన్‌ఏఐ మాజీ బోర్డు సభ్యురాలు హెలెన్ టోనర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన భద్రతా నిపుణురాలైన ఆమె ఏఐ ముప్పు తీవ్రతను వివరించారు.ఒక్క కిల్ స్విచ్‌తో అన్ని సమస్యలనూ పరిష్కరించడం అసాధ్యమని టోనర్ స్పష్టం చేశారు. కొన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో వేర్వేరు స్థాయుల్లో షట్‌డౌన్ లేదా ఓవర్‌రైడ్ వ్యవస్థలు ఉపయోగపడతాయేమో కానీ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన వ్యవస్థలను పూర్తిగా ఆపలేవని తెలిపారు. అమెరికా పరిధికి ఆవల, పూర్తి స్వయంప్రతిపత్తితో నడిచే కంప్యూటింగ్ వ్యవస్థలపై పనిచేసే ఏఐలను నియంత్రించడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు. చైనా పోటీని బూచిగా చూపిస్తూ అత్యంత ప్రమాదకరమైన ఏఐ టెక్నాలజీని గుడ్డిగా అభివృద్ధి చేసుకుంటూ పోవడం ఆత్మహత్యాసదృశ్యమని అభిప్రాయపడ్డారు.మరోవైపు 'ఏఐ గాడ్‌ఫాదర్'గా పేరొందిన జెఫ్రీ హింటన్ సైతం ఏఐ ముప్పుపై తీవ్ర హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ లేదా ఆర్థిక వ్యవస్థలను స్తంభింపజేసేలా ఏఐ వల్ల 'చెర్నోబిల్' తరహా పెను విపత్తు సంభవించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఏడాది లేదా రెండేళ్లలోనే ఇలాంటి దుర్ఘటన జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి తీవ్రమైన రిస్కులు ఉంటాయని తెలిసినప్పటికీ ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, శామ్ ఆల్ట్‌మన్ వంటి దిగ్గజాలు లాభాల కోసం పోటీపడుతున్నారని హింటన్ విమర్శించారు. ఏఐ చాట్‌బాట్లు సొంత భాషను అభివృద్ధి చేసుకుంటే నియంత్రణ పూర్తిగా చేజారిపోతుందని తేల్చిచెప్పారు.

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, బీఆర్ఎస్ నాయకత్వంపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు.తమ పార్టీ టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు తనపై వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తనను ఇలా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల వారికి ఏం వస్తుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే తనను ఇంటి నుంచి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని అన్నారు.గతంలోనూ తన ఆరోగ్యంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారని, తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ ప్రచారం చేశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తన నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం గతంలో కేసీఆర్ వద్దకు వెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఇరు వర్గాల మధ్య రాజకీయ విభేదాలు మరింతగా తీవ్రరూపం దాల్చాయి.

మరోవైపు, నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడాన్ని అందరూ ఐక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

ఏపీలో రేపు ఓటు పండుగ.. పల్లెలు, పట్టణాల్లో పోలింగ్ సందడి!

పల్లెల్లో పోలింగ్, లెక్కింపు నేడే..

గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ సందడి ఉదయం 7 గంటలకే మొదలుకానుంది. తొలి విడతలో మొత్తం 3,949 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, అందులో 758 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,191 సర్పంచ్ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుండగా, బరిలో 9,052 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 269 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, అన్నమయ్య జిల్లాలో అత్యధిక స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు.అలాగే 39,832 వార్డు సభ్యుల స్థానాలకు గాను 14,727 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 25,061 స్థానాల్లో 53,678 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పంచాయతీ పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, రేపు సాయంత్రానికే ఫలితాలు వెల్లడించనున్నారు. ఫలితాల ప్రకటన ముగిసిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా అక్కడికక్కడే నిర్వహిస్తారు. ఎక్కడైనా అనివార్య కారణాల వల్ల రీపోల్ అవసరమైతే నవంబర్ 27న నిర్వహిస్తారు.

నగరాలు, పురపాలికల్లోనూ ఓటింగ్

గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ రేపు ఎన్నికల వేడి కనిపించనుంది. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లలో రేపు పోలింగ్ జరగనుంది. ఈ నాలుగు కార్పొరేషన్ల పరిధిలోని 260 వార్డుల్లో ఇప్పటికే రాజమహేంద్రవరంలో 2 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 258 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తున్నారు.

వీటితో పాటు ఆమదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు (నెల్లూరు), అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట వంటి 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. పట్టణ సంస్థల్లోని 750 వార్డుల్లో 39 ఏకగ్రీవం కాగా, మిగిలిన 711 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,801 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇక్కడ సుమారు 24.98 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. అయితే ఈ పట్టణ సంస్థల ఓట్ల లెక్కింపును మాత్రం నవంబర్ 30న చేపట్టనున్నారు.

పటిష్ఠ బందోబస్తు.. స్థానిక సెలవు

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం స్థానిక సెలవు ప్రకటించింది. పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు విడతల్లో జరుగుతుండగా, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2న నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది.

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పెట్టుబడుల రక్షణ చట్టం' (ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్) బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సమావేశాలు దాదాపు 15 రోజుల పాటు కొనసాగవచ్చని తెలుస్తోంది.రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక పెట్టుబడులకు రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా చట్టపరమైన భరోసా కల్పించడమే ఈ నూతన చట్టం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో అధికారం మారినప్పుడు... పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు, భూ కేటాయింపుల విషయంలో భవిష్యత్తులో విధానపరమైన ఆకస్మిక మార్పులు జరగకుండా నిరోధించేందుకు ఈ బిల్లును రూపొందిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు.

ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రికార్డు స్థాయిలో దాదాపు రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామికవేత్తల్లో మరింత నమ్మకాన్ని పెంచేందుకు ఈ చట్టాన్ని వేగంగా తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "చాలా మంది పెట్టుబడిదారులు దీనిపై మమ్మల్ని అడిగారు. ప్రభుత్వం దీనిపై తీవ్రంగా ఆలోచిస్తోంది, కచ్చితంగా చట్టం తెస్తాం" అని పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రంగా చర్చించనున్నారు.

ఏపీ సొంత రాబడి పెరిగింది..

- మొదటి పేజీ తరువాయి

ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ (సాయి ప్రసాద్)తో పాటు ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1,27,506 కోట్లు కాగా, నవంబర్ 23 నాటికే అందులో 58 శాతం మేర సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైంది. పన్ను ఆదాయం గతేడాది రూ.53,692 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.10,104 కోట్లు పెరిగి రూ.63,796 కోట్లకు చేరింది. అలాగే పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు ఎగబాకింది.

శాఖల వారీగా ఆదాయ వివరాలు:

వాణిజ్య పన్నులు: 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్ల మేర అదనపు ఆదాయం నమోదైంది. ఇందులో జీఎస్టీ ద్వారా వచ్చిన రాబడి 18.1 శాతం పెరిగి రూ.3,694 కోట్లకు చేరింది.

ఎక్సైజ్ శాఖ: స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.20,083 కోట్ల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే 19.6 శాతం వృద్ధితో రూ.3,287 కోట్లు అదనంగా సమకూరింది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు: 16.6 శాతం వృద్ధితో మొత్తం రూ.8,020 కోట్ల రాబడి వచ్చింది.

రవాణా శాఖ: వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా 17.3 శాతం వృద్ధి నమోదై రూ.3,649 కోట్ల పన్నుల ఆదాయం సమకూరింది.

గనులు, భూగర్భ శాఖ: 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు చేరింది.

అటవీ శాఖ: 22.3 శాతం పెరిగి రూ.22 కోట్ల ఆదాయం లభించింది.

స్థానిక సంస్థలు: ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీల పన్ను ఆదాయం రూ.238 కోట్లుగా, పట్టణ స్థానిక సంస్థల్లో రూ.2,365 కోట్లుగా నమోదైంది.

ప్రజలపై భారం మోపొద్దు: సీఎం చంద్రబాబు

సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండానే ప్రభుత్వ శాఖల్లో రాబడిని మరింత పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, లోపాలను సరిదిద్దడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకతను పెంచడం వల్లే ఆదాయంలో గణనీయమైన పురోగతి కనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం స్పష్టంగా ప్రతిబింబించేలా ఆదాయ వృద్ధి కొనసాగాలని అధికారులను ఆదేశించారు.

పన్ను వసూళ్ల వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ స్టాక్ వినియోగిస్తున్నామని.. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, క్షేత్రస్థాయి తనిఖీలు, న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారంలో సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

రాజకీయాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో భాగంగా తెలుగుదేశం పార్టీ మరో ముందడుగు వేసింది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆలోచనతో, పార్టీ కార్యకర్తలను అధిష్ఠానంతో అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'మైటీడీపీ' (వీఐఐపీ) యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షల మైలురాయిని అధిగమించింది. ఈ మేరకు టీడీపీ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది. దేశంలోని ప్రాంతీయ పార్టీల డిజిటల్ నిర్వహణలో ఇది ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

నారా లోకేశ్ విజన్ కు అనుగుణంగా ఈ డిజిటల్ వేదికను అభివృద్ధి చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే సాధారణ కార్యకర్తలను గుర్తించి, వారి సేవలకు తగిన అవకాశాలు కల్పించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది. గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలు నిర్వహించే కార్యకర్తలు తమ వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు. దీని ద్వారా కార్యకర్తల పనితీరును నేరుగా పరిశీలించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు, పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది.

ఈ యాప్ ద్వారా అధినేత సందేశాలు, పార్టీ మార్గదర్శకాలు త్వరితగతిన శ్రేణులకు చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయి సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇది ఉపయోగపడుతోంది. ఇటీవల నిర్వహించిన డిజిటల్ మహానాడుతో పాటు శిక్షణా తరగతులు, ఇతర సమావేశాల హాజరును కూడా ఈ వ్యవస్థ ద్వారానే పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా, పార్టీ నాయకులతో కార్యకర్తలు దిగిన ఫొటోలను సులభంగా పొందేందుకు వీలుగా 'ఫొటో బూత్' పేరిట ఫేస్ రికగ్నిషన్ సదుపాయాన్ని కూడా ఇందులో పొందుపరిచారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ వినియోగంలో పార్లమెంట్ విభాగంలో నరసరావుపేట, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు నియోజకవర్గాలు ముందంజలో ఉండగా.. అసెంబ్లీ విభాగంలో కుప్పం, వినుకొండ, కనిగిరి, మంగళగిరి, గన్నవరం నియోజకవర్గాలు అగ్రస్థానంలో నిలిచాయని పార్టీ ప్రకటన వివరించింది. ఆధునిక కాలంలో రాజకీయ వ్యవస్థను సాంకేతికతతో జోడించి, కార్యకర్తలే కేంద్రంగా పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ డిజిటల్ వేదిక ఒక కీలక సాధనంగా మారిందని తెలుగుదేశం పార్టీ పేర్కొంది.

జగన్ సీఎం పదవి అడిగారు..సోనియా నో చెప్పారు!

- మొదటి పేజీ తరువాయి

పలు అంశాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం అనంతరం, ముఖ్యమంత్రి పీఠం కోసం జగన్ తీవ్రంగా డిమాండ్ చేశారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అయితే జగన్ చేసిన ఆ అభ్యర్థనను అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పూర్తిగా నిరాకరించారని తెలిపారు. ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించకపోవడంతోనే, జగన్ పార్టీతో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేశారని విజయసాయిరెడ్డి వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అసలైన వెన్నుపోటుదారు ఎవరో వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆలోచించి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

గతంలో వైసీపీలో తన స్థానం గురించి మాట్లాడుతూ... పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టేందుకు తాను పడిన శ్రమ, చేసిన పోరాటాల ఫలితంగానే తనకు పార్టీలో నంబర్-2 స్థానం లభించిందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తన కష్టాన్ని గుర్తించి ఆ గుర్తింపు ఇచ్చారే తప్ప, ఎవరూ ఉచితంగా ఏమీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు తన ప్రస్తుత పార్టీ విధివిధానాలపై విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు. 1983లో తెలుగుదేశం పార్టీ అనుసరించిన ప్రజా విధానాలనే తమ పరివర్తన రాజనీతి పార్టీ కూడా అనుసరిస్తుందని ఆయన వెల్లడించారు. పీఆర్‌పీ ఎల్లప్పుడూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి మరియు సంక్షేమం కోసమే నిబద్ధతతో పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

సీఐఐనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

తాడిని తన్నే వాడుంటే.. వాడి తల తన్నే వాడొకడుంటాడన్నట్లుంది అమెరికా (ఖూూ) నిఘా సంస్థ సీఐఏ (జxూూ) పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని ఆ సంస్థ సేకరిస్తే.. ఆ సంస్థ కంప్యూటర్లలోకి చొరబడి హ్యాకర్లు డేటాను అపహరించారు. ఇందుకోసం వాడినట్లు భావిస్తున్న సైబర్ ఆయుధం చైనా తయారీగా అనుమానిస్తున్నారు. అబ్బే మా దగ్గర రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతిలో పడలేదని సీఐఏ చెబుతున్నా.. జరిగిన ఘటన అగ్రరాజ్యాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ), ది నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ది ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందో మాత్రం అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్య డేటా మాత్రం భద్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటీ చైనా ఆయుధం ఆర్టెక్స్..?

అమెరికా నిఘా సంస్థల కంప్యూటర్లలోకి చొరబడేందుకు చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్‌ను వాడారు. దాని పేరు ఆర్టెక్స్ (ఖూతీవఱ). ఈ ఏడాది ప్రారంభంలో ఓ చైనా ఇంజినీర్ దీనిని సైబర్ సెక్యూరిటీ కోసం అంటూ తయారు చేశాడు. జులై నుంచి బహిరంగంగా అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి జపాన్, దక్షిణ కొరియాలోని పలు వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు దీనిని వాడినట్లు ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరికాపై సైబర్ దాడులు చేస్తున్నారు.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌ను టార్గెట్ చేసి..

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా నుంచి సేకరించిన డేటా, ఉపగ్రహ చిత్రాలు, ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ హ్యాకర్ల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. తమకు చేరే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్‌జీఏ స్పందించలేదు.

దలైలామా విషయంలో ఏదో సస్పెన్స్.. సైలెంట్‌గా దిల్లీలో బంగ్లా కేటాయింపు..!

అమెరికా నిఘా సంస్థలకు ఏమైంది..?

ఇటీవల అమెరికా నిఘా, భద్రతా సంస్థల్లో తరచూ సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు చోటుచేసుకుంటున్నాయి. కొన్నాళ్ల క్రితం నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కీలక నెట్‌వర్క్ మొరాయించింది. అయితే ఇది సైబర్ దాడి కాదని ఎన్ఎస్ఏ తెలిపింది. ఇక అమెరికాలోని క్రిమినల్స్, అనుమానితుల డేటాను ఎఫ్‌బీఐ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి హ్యాకర్లు కాజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా ధ్రువీకరించారు. దీంతోపాటు గత వారం అమెరికా వ్యవసాయ శాఖపై కూడా సైబర్ దాడి జరిగింది.

గల్లంతైన కాకినాడ మత్స్యకారులు క్షేమం

కాకినాడ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి కింజరా

గాయపడిన ఆలయ ఉద్యోగి కుటుంబానికి ఎమ్మెల్యే బొజ్జల అండ

- రూ.20.25 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీకి సిఫార్సు.. దేవస్థానం ద్వారా ఆర్థిక సాయం అందించాలని ఆదేశం

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 25:

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తూ ఆకతాయిల దాడిలో తీవ్రంగా గాయపడిన సెక్యూరిటీ గార్డు ధనుంజయ నాయుడు కుటుంబానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భరోసా కల్పించారు. మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.20.25 లక్షల ఎల్ఓసీమంజూరుకుముఖ్యమంత్రికార్యాలయానికి సిఫార్సు చేశారు. అంతేకాకుండా దేవస్థానం తరఫున కూడా బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

బాధితుడి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక ఇబ్బందులను బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్‌నాథ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.ఎమ్మెల్యే తక్షణ చొరవతో బాధితకుటుంబానికి వైద్యపరమైన, ఆర్థికపరమైన భరోసా లభించిందని అమర్‌నాథ్ కృతజ్ఞతలు



తెలిపారు. ధనుంజయ నాయుడు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు.

మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని కలిసిన కివేటి సంజీవయ్య,తంబిరెడ్డి రాజేశ్వరమ్మ



నాయుడుపేట నవంబర్25 పెన్ పవర్ ప్రతినిధి.

నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తంబిరెడ్డి రాజేశ్వరమ్మ ఎన్నికైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కివేటి సంజీవయ్య, నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ తంబిరెడ్డి రాజేశ్వరమ్మ బుధవారం తిరుపతి లోని మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

అనంతరం తిరుపతి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన అభినయ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కివేటి సంజీవయ్య,నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ తంబిరెడ్డి రాజేశ్వరమ్మ లు భూమన కరుణాకర్ రెడ్డి,భూమన అభినయ్ రెడ్డి లకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.నాయుడుపేట మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగాపార్టీభవిష్యత్‌కార్యక్రమాలు,నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధి తదితర అంశాలపై నాయకులు చర్చించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,వైసిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి,టీఎంఆర్ గ్రూప్ అధినేత తంబిరెడ్డి మోహన్‌రెడ్డి,జిల్లాలీగల్‌సెక్రటరీచదలవాడకుమార్ ,గోట్టికాటి రవీంద్ర రెడ్డి,పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

జర్నలిస్టుల పట్ల కమిషనర్ అనుచిత ప్రవర్తనపై విమర్శలు!

- మీడియా ప్రతినిధులతో మర్యాదగా వ్యవహరించాలి.. అధికారుల తీరుపై జర్నలిస్టుల ఆవేదన.

నాయుడుపేట నవంబర్25 పెన్ పవర్ ప్రతినిధి.



నాయుడుపేట: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల పట్ల నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ యస్ కె పజుల్లుల్లా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టులతో మాట్లాడే సమయంలో అసభ్యకరమైన పదజాలం ఉపయోగిస్తూ, అవమానకరంగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాయుడుపేట మునిసిపల్ ఎన్నికలలో కమిషనర్ పజుల్లుల్లా జర్నలిస్టు సమాచారం మీడియా పాయింట్ అందుబాటులో లేని పక్షంలొ జర్నలిస్టు లు ప్రర్నించినందుకుగాను, మునిసిపల్ వైస్ చైర్మన్ ప్రమాణస్వీకారం జర్నలిస్టు లకు ఎటువంటి సమాచారం ఇవ్వకపొవడం పై జర్నలిస్టు వివరణ అడగగా జర్నలిస్టు పై పైర్ అయ్యారు.

ప్రజా సమస్యలు, మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు వంటి అంశాలపైసమాచారం తెలుసుకోవడానికి వెళ్లే మీడియా ప్రతినిధులతో అధికారులు గౌరవప్రదంగావ్యవహరించాల్సినబాధ్యత ఉంది. అయితే కమిషనర్ మాటతీరు జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని పలువురు మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నలు అడగడం జర్నలిస్టుల విధి కాగా, వాటికి సమాధానాలు ఇవ్వడం అధికారుల బాధ్యత. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను గౌరవిస్తూ, జర్నలిస్టులతో సమన్వయంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి, వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అధికారుల హోదా కంటే ప్రజాసేవ, పరస్పర గౌరవమే ముఖ్యమని వారు పేర్కొంటున్నారు.

నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ ఉ రుకుందమ్మ పుట్టినరోజు వేడుకలు.

నాయుడుపేట నవంబర్ 25 ప్రతినిధి



నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శాలువాలు కప్పి పూల బుకేలతో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ వేడుకల్లో 30వ వార్డు కౌన్సిలర్ దగ్గోలు బేబీ భవిత, 13వ వార్డు కౌన్సిలర్ సునీతమ్మ మరియు లక్ష్మయ్య పాల్గొని మేనేజర్ ఉరుకుందమ్మకు పుష్పగుచ్ఛం, బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది కూడా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

తోటి ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల మధ్య ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా మేనేజర్ ఉరుకుందమ్మ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది, ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి ఈ వేడుకలు నిదర్శనంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఖాసీం రమేష్..వాసు ..సుబ్బారావు. శ్రావణి. మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబన్, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం కు 52 వ వార్డు టీడీపీ ఇంచార్జి మరాఠీ సూరి ఘన సత్కారం.

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 25



నంద్యాల పురపాలక సంఘం చైర్మన్, డాక్టర్ డి.బాబన్, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం కు 52 వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మరాఠీ సూరి, టీడీపీ నాయకులు,కార్యకర్తలుమర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు,

ఈ సందర్భంగా మరాఠీ సూరి మాట్లాడుతూ, స్థానిక మంత్రి ఎన్ఎండీ ఫరూక్.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్. రాష్ట్ర నాయకులు ఎన్.ఎం.డి ఫయాజ్ ,మార్గదర్శకత్వంలో చైర్మన్ డాక్టర్ బాబన్ సారథ్యంలో నంద్యాల పట్టణంతో పాటు 52 వ వార్డు అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు,

కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, పట్టణంలోని 52 వార్డులోని తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యల పరిష్కారానికి చైర్మన్ సహకారంతో కృషి చేస్తామని స్పష్టం చేశారు,ఈ కార్యక్రమంలో 52 వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎకగ్రీవమైన బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇంద్రారెడ్డి

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 25



నంద్యాల జిల్లా బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి అధికారికంగా డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారిణిసుభాషిణిడిక్లరేషన్‌అందజేశారు.

అలాగే ఏకగ్రీవంగా ఎన్నికైన 20 మంది వార్డు సభ్యులకు డిక్లరేషన్లు అందజేశారు. అనంతరం టంగుటూరి శ్రీనివాసులు ని ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ ఈవో మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

వివా ఆల్ఫా ఈవి బైక్‌లు కొనుగోలు చేసి పర్యావరణం, శబ్ద కాలుష్యాన్ని నివారించండి.

- నంద్యాల తాలూకా సీ ఐ ఈశ్వరయ్య.

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 25



వివా ఆల్ఫా ఈ వి మోటారు బైక్ లు కొనుగోలు చేసి పర్యావరణం, శబ్ద కాలుష్యాన్ని నివారణకు కృషి చేయాలని నంద్యాల తాలూకా సీ ఐ ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు.

బుధవారం నంద్యాల నూనెపల్లె– రైతునగరం రోడ్డులోని శ్రీ చక్ర సూపర్ మార్కెట్ ప్రక్కన ప్రొప్రైటర్ కుందూరు. మాధవరెడ్డి వి వా ఆల్ఫా ఈ వి బైక్ షో రూమ్ ను నంద్యాల తాలూకా సీ ఐ ఈశ్వరయ్య ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీ ఐ మాట్లాడుతూ మారుతున్నకాలానికిఅనుగుణంగావాహనదారులు మారాలని, పట్టణాల్లో వాహనాల పొగ, శబ్దం కాలుష్యం వల్ల అనేక వినికిడి, శర్మ,, బిపి, గుండె సంబందించిన రోగాలు ఏర్పడుతున్నాయని, భవిష్యత్ తరాల కోసం శబ్ద, పర్యావరణ కాలుష్యంను నివారణ చేయాల్సిన బాధ్యత వాహనదారులపై ఉందన్నారు. మార్కెట్ లో అనేక కంపెనీలు ఈ వి బైక్స్ ను ప్రమోట్ చేస్తున్నాయని, ఆల్ఫా ఈ వి బైక్స్ ను కూడా మార్కెట్ లోకి విడుదల చేయడం, నంద్యాల నూనెపల్లి లో ఆల్ఫా ఈ వి బైక్ షోరూం నూతనంగా ఏర్పడడం మంచి పరిణామం అన్నారు. వివా ఆల్ఫా ఈ వి బైక్ షోరూం అధినేత కుందూరు. మాధవరెడ్డి, రామకృష్ణలు మాట్లాడుతూ మా ఆల్ఫా ఈ వి బైక్ నాణ్యత ప్రమాణాలతో కూడినదని, 12 వాహనాలు మార్కెటింగ్ చేసిన వారికి ఒక బైక్ ఉచితంగా ఇవ్వడం ఆఫర్ గా పెట్టామన్నారు. వివా ఆల్ఫా ఈ వి బైక్స్ అమ్మకాలు, సేవలు మా షోరూం లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమం లో నంద్యాల తాలూకా ఎస్. ఐ. గంగయ్య యాదవ్, ఎస్. ఐ సురేష్, ఎస్. ఐ జఫ్రూల్లా, హెడ్ కానిస్టేబుల్ చెన్నమ్మ, వివా ఆల్ఫా ఈ వి బైక్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్, మార్కెటింగ్ మేనేజర్ ఉసెన్, సీనియర్ ఈ వి బైక్ మెకానిక్ మణి తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

-8మండలాల్లో 107 గ్రామపంచాయతీలు, 975 వార్డులకు ఎన్నికలు

- 183 పోలింగ్ కేంద్రాల పరిధిలో 773 పోలింగ్ గదుల ఏర్పాటు

- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబరు 25

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మొదటి విడతలో భాగంగా జిల్లాలోని 8 మండలాల పరిధిలో 107 గ్రామపంచాయతీల్లో 975 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం మొత్తం 183 పోలింగ్ కేంద్రాల లొకేషన్ల పరిధిలో 773 పోలింగ్ గదులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మండలాల వారీగా ఎన్నికల ఏర్పాట్ల వివరాలు

ఆళ్లగడ్డ: 14 గ్రామపంచాయతీలు, 127 వార్డులు, 24 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 2, అత్యంత సమస్యాత్మక – 6

చాగలమర్రి: 15 గ్రామపంచాయతీలు, 142 వార్డులు, 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 2, అత్యంత సమస్యాత్మక – 3

దొర్నిపాడు: 5 గ్రామపంచాయతీలు, 41 వార్డులు, 10 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 1

రుద్రవరం: 20 గ్రామపంచాయతీలు, 188 వార్డులు, 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 10, అత్యంత సమస్యాత్మక – 5

శిరివెళ్ల: 13 గ్రామపంచాయతీలు, 127 వార్డులు, 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 4 , అత్యంత సమస్యాత్మక – 4

ఉయ్యాలవాడ: 10 గ్రామపంచాయతీలు, 74 వార్డులు, 14 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు.



సమస్యాత్మక – 3

నంద్యాల: 17 గ్రామపంచాయతీలు, 158 వార్డులు, 33 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 6, అత్యంత సమస్యాత్మక – 5

గోస్పాడు: 13 గ్రామపంచాయతీలు, 118 వార్డులు, 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. సమస్యాత్మక – 1, అత్యంత సమస్యాత్మక – 3

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు, నిరంతర పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రశాంత నిర్వహణకు అధికారులు, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం 26వ వార్డు కౌన్సిలర్ శ్రావణి ఆనంద్

- ఎన్నో ఏళ్ల నుండి ఉన్న కాలువల సమస్యలపై స్పందించిన కౌన్సిలర్.

.- వార్డును సందర్శించిన కమీషనర్ ఇనమల చిన్న బాబు.

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 25



బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీరు, డ్రైనేజీ, బ్లాకేజిల పరిష్కారం కొరకు బుధవారం వార్డు ప్రజలతో కలిసి కౌన్సిలర్ శ్రావణి సమస్యను కమీషనర్ ఇనమల చిన్నబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమీషనర్ వార్డులో పర్యటించి కాలువలు ఎక్కడ బ్లాక్ అయ్యాయి, ఎక్కడ పూడిక పేరుకుపోయిందో పరిశీలించారు. సమస్యలను చైర్ పర్సన్ దొడ్ల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లి ఆమె సహకారంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. వీటితోపాటు జంగిల్ క్లియరెన్స్ పై కూడా కౌన్సిలర్ దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రావణి మాట్లాడుతూ వార్డు ప్రజల ప్రతి సమస్యను తన సమస్యగా భావించి, సమస్య పరిష్కారం అయ్యేవరకు అందరికీ అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనలతో, చైర్ పర్సన్ విజయలక్ష్మి సహకారంతో వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతంలో కాలువల నిర్మాణానికి అనుమతులు మంజూరైనప్పటికీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొన్నారు. కౌన్సిలర్ చొరవతో కమీషనర్ స్వయంగా వార్డును సందర్శించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శ్రావణి లాంటి యువ నాయకురాలికి కౌన్సిలర్ గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగసాయి, గోకుల్, వెంకటస్వామి, రాఘవయ్య, కామయ్య, హరిబాబు, అరుణ్, బాలాజి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

పెన్ పవర్ నవంబర్ 25



ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి కొరత తలెత్తకుండాఅధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ,ఎస్సి,ఎస్టీ, బీసీ ,మైనార్టీ, మిషన్ భగీరథ, వివిధ శాఖల అధికారులతో ఎల్ నీ నో ప్రభావం ,విద్య సంస్థల్లో నీటి సంరక్షణ చర్యలు పై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్, జూలై నెలల వరకు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో నీటి లభ్యతపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యా సంస్థలో నీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

సర్పంచ్ అభ్యర్థిగా భువనేశ్వరం శైలజ



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్. 25

రేబాల గ్రామ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా భువనేశ్వరం శైలజ పేరును ఖరారు చేస్తూ ప్రకటించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.

రేబాల గ్రామ ప్రజలందరూ భువనేశ్వరం శైలజకు ఓట్లు వేసి సర్పంచ్ గా గెలిపించుకొని గ్రామ అభివృద్ధికి సహకరించవలసిందిగా ఎమ్మెల్యే కోరారు.

సర్పంచ్‌గా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా!

- భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా టీడీపీ అభ్యర్థుల జోరుగా ప్రచారం

నాయుడుపేట, నవంబర్ 25 పెన్ పవర్ ప్రతినిధి

నాయుడుపేటమండలంభట్లకనుపూరు గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సర్పంచ్ అభ్యర్థి గున్నంరెడ్డి మధుసూదనరెడ్డి, 8వ వార్డు సభ్యురాలిగా పోటీ చేస్తున్న బండి శిరీష గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా అభ్యర్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలుసుకుని తమకు మద్దతు తెలిపి ఓటు వేయాలని అభ్యర్థించారు.



ప్రధాన లక్ష్మమని గున్నంరెడ్డి మధుసూదనరెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు తమ అమూల్యమైన ఓటును కేటాయించిన గుర్తులపై వేసి తమను గెలిపించాలని అభ్యర్థులు కోరారు. ప్రచారంలో గ్రామస్థుల స్పందన లభించిందని అభ్యర్థులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గున్నంరెడ్డి అరుణరెడ్డి, సర్పంచ్ అభ్యర్థి గున్నంరెడ్డి మధుసూదనరెడ్డికి కత్తెర గుర్తు, 8వ వార్డు అభ్యర్థి బండి శిరీషకు కుక్కర్ గుర్తు కేటాయించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన రవీంద్ర రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముక్తభారత్ కార్యక్రమంలో డాక్టర్ దినేష్ కుమార్

పెన్ పవర్ రొంపిచర్ల మండలం నవంబర్ 25

రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనీ బెస్తపల్లి గ్రామం నందు 104 వాహనం లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమము నందు ఈరోజు ప్రధాన వైద్యులు డా. దినేష్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామప్రజలకు టి . బి ముక్తభారత్ అను కార్యక్రమంలో కార్యక్రమంలోక్షయవ్యాధి నియంత్రణలో బాగంగా 50 మందికి ఎక్రేలు లు తీయడం జరిగింది తదనంతరం రాజేశ్వరి మండల ఆరోగ్య విద్యాధికారి ప్రజలకు ఉద్దేశించి ఈ క్రింది విషయాలు పై అవగాహన కల్పించారు.

క్షయవ్యాధి టీ బి పై అవగాహన పెంచడం, వ్యాధిని నిర్మూలించడం మరియు సరైన చికిత్స గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం సరైన సమయంలో గుర్తిస్తే, టిబి వ్యాధికి ఉచితంగా, పూర్తిగా నయం చేయగల చికిత్స అందుబాటులో ఉంది. లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

క్షయవ్యాధిఅనేదిమైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది, కానీ శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాపించవచ్చు. టి బి వ్యాధి గాలి ద్వారా, తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు వ్యాపిస్తుంది. కానీ దీనికి భయపడాల్సిన అవసరం లేదు. టిబి సోకిన వ్యక్తి ఇతరులకు వ్యాప్తి చెందకుండా మాస్క్ ధరించాలి. మన దేశంలో, "నిక్షయ్ పోషణ్ యోజన" వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా రోగికి నెలకు రూ.500 అందజేస్తుంది వ్యాధి తగ్గేవరకు ప్రభుత్వ



ఆస్పత్రులలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు (టెస్టులు) చేస్తారు మరియు ఉచితం గా మందులను అందజేస్తారూ. ఈ కార్యక్రమంలో అమ్మాణ్ణి సి హెచ్ ఓ, లక్ష్మీపతి ,రామయ్య టీ బి సూపర్వైజర్స్, శ్రీవిద్య ఎమ్మెల్‌హెచ్ పి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్లకు ఘన సత్కారం



సూళ్ళూరుపేట నవంబర్25 పెన్ పవర్ ప్రతినిధి

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో కోళ్ల మిట్ట కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించిన 30వ వార్డు కౌన్సిలర్ మేడా సాయి నారాయణ ని 26వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి వేలూరు సాధనా రెడ్డి ని, కోళ్ళమిట్ట సచివాలయ సిబ్బంది తమ కార్యాలయానికి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది సమన్వయం మరియు సహకారంతో వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా కృషి చేయాలని కోరారు. అలాగే, వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షించాలని సచివాలయ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగాఁ వార్డు అభివృద్ధే ధ్యేయంగాఁ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుదాం అన్ని పిలుపునిచ్చారు...

జువ్వలపాలెంలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థి తుపాకుల శ్రీను ప్రచార హోరు

- జోరు వానలో సైతం ఇంటింటి ప్రచారం - అభివృద్ధే హామీ

నాయుడుపేట నవంబర్25 పెన్ పవర్ ప్రతినిధి.

నాయుడుపేట. జువ్వలపాలెం గ్రామ పంచాయతీ టీడీపీ సర్పంచ్ అభ్యర్థి తుపాకుల శ్రీను బుధవారం పంచాయతీపరిధిలోనికారమంచివారికండ్రిగ,మందబయలు గ్రామాల్లోని 8 వార్డుల్లో జోరుగా ప్రచారం సాగించారు.జోరు వానను సైతం లెక్కచేయక గ్రామంలోని ప్రతి వీధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయతీని అభివృద్ధి చేస్తానని టిడిపి సర్పంచ్ అభ్యర్థి తుపాకుల శ్రీను తెలియజేశారు.

ఈ సందర్భంగా తుపాకుల శ్రీను మాట్లాడుతూ తనను



సర్పంచ్ గా గెలిపిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పంచాయతీని అభివృద్ధి చేస్తానని, జువ్వలపాలెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు.చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానన్నారు. మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.వానలో తడుస్తూ వచ్చి తనను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అంటూ మీ ఆశీస్సులతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బిరదవాడనారాయణ,మల్లూరవికుమార్,మధు,శివ,ఆనంద్, ఉదయ్,ప్రవీణ్,తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరి మున్సిపాలిటీలో 20వ వార్డు కౌన్సిలర్‌గా జంపాల ప్రకాష్ ప్రమాణ స్వీకారం

వెంకటగిరి నవంబర్25 పెన్ పవర్ ప్రతినిధి.



వెంకటగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో 20వ వార్డు కౌన్సిలర్‌గా జంపాల ప్రకాష్ ఘనంగా ప్రమాణ స్వీకారం గౌరవ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కౌన్సిలర్ జంపాల ప్రకాష్ కి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, 20వ వార్డు అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి దొంతు శారద, మాజీ ఏఎంసీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కమిషనర్, కూటమి ముఖ్య నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, కార్యకర్తలు, 20వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన కౌన్సిలర్‌కు అభినందనలు తెలియజేశారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాము.

ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఏఎస్పి సుస్మిత ఐపీస్ ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్.

- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చెయ్యాలి......

- నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి సుస్మిత ఐపీస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 25

నంద్యాల తాలూకా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేపు మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీస్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఎస్పి సుస్మిత ఐపీస్ వివిధ గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రత ఏర్పాట్ల గురించి అధికారులతో సమీక్షించడం జరిగింది.

ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలు



స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు.

అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడిన ఎ.ఎస్పీ , ప్రజల భద్రత, రక్షణను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నంద్యాల జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు, అవాంఛనీయ సంఘటనలకు



తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- ఓటర్లు భయం, ఒత్తిడి లేకుండా ఓటు వేసేలా పటిష్ట భద్రత కల్పించాలి

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 25:

రేపు జరగనున్న శ్రీకాళహస్తి మున్సిపల్, గ్రామ పంచాయతీఎన్నికలుప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలనినాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు తిరుపతి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు, ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఇటీవల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న దాడులు, గూండాగిరి, అభ్యర్థుల, కార్యకర్తలపై జరిగిన భౌతిక దాడులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును



వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని నాయకులు అధికారులను కోరారు.

పంచాయితీ సర్పంచుల జోరు ప్రచారం...

పెళ్ళకూరు,పెన్ పవర్, నవంబర్ 25

పెల్లకూరుమండలంలోని24గ్రామపంచాయతీలో పుల్లూరు, కానూరురాజుపాలెంపంచాయతీలను ఏకగ్రీవంగా వైఎస్ఆర్సిపి కైవసం చేసుకుంది, మిగిలిన 22గ్రామపంచాయతీలోటిడిపిమరియు వైఎస్ఆర్సిపి తో పాటు కొన్ని గ్రామాలలో త్రిముఖ పోటీ, నలుగురు పోటీలో ఉన్నారు, ఈ క్రమంలో చావాలి గ్రామపంచాయతీనందు వైయస్సార్సీపి, టిడిపి,జనసేనముగ్గురుపోటీలో కొనసాగుతున్నారు, తెలుగుదేశం పార్టీకిచెందిన నల్లి బోయిన వెంకటప్రసాద్ సతీమణి శ్రీదేవి సర్పంచ్ అభ్యర్థిగా సర్పంచ్ బరిలో ఉండగా దంపతులు ఇద్దరూ నాయకులతో కలిసి ఉంగరం గుర్తుకుఓటువేయాలనిఇంటింటి ప్రచారాన్నిజోరుగాకొనసాగిస్తున్నారు.

ఈక్రమంలోశ్రీదేవిమాట్లాడుచూరాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి మాతో కలిసి రండిఅంటూఆమెఇంటింటిప్రచారంకొనసాగిస్తుంది, ప్రతి వీధికి వెలుగు, ప్రతిఇంటికిభరోసాతో, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి తోడుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను ఒకఅవకాశం ఇవ్వండి అంటూ నాయకులతో తో కలిసి ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగిస్తున్న క్రమంలోనాయకులుసూర్యనాయుడు,సుందరయ్య, గురవయ్య, లోకేష్, చంద్ర,శ్రీనివాసులు, సిద్ధి నాయుడు, వెంకటేశ్వర్లు,రవి, కృష్ణయ్య యశ్వంత్ సురేష్ మొదలైనవారుకార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు.



గెలుపును సైతం గర్వంగా చెప్పుకోలేని పరిస్థితిలో నంద్యాల కూటమి ప్రభుత్వం!

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 25

నంద్యాలలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చినా, ఎన్ని ఇబ్బందులు సృష్టించినా వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను అభినందిస్తున్నామని శిల్పా రవి పేర్కొన్నారు.

"అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా ప్రజాస్వామ్య విలువల కోసం నిలబడిన మా కౌన్సిలర్లు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారని



గర్వంగా చెప్పుకుంటున్నాం. కానీ నేడు కూటమి ప్రభుత్వం సాధించిన విజయాన్ని వారు గర్వంగా చెప్పుకోగలుగుతున్నారా?" అని ప్రశ్నించారు. ఇది టీడీపీ గొప్ప విజయమని చెప్పుకోవడం కంటే, అధికారం, ప్రలోభాలు, రాజకీయ ఒత్తిళ్ల మధ్య ప్రజాస్వామ్య విలువలు ఏ స్థాయిలో పరీక్షకు గురయ్యాయో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

పదవులు, అధికారాలు శాశ్వతం కావని, ప్రజల అభిమానం, కార్యకర్తల ఆత్మగౌరవం, నమ్మకమే నిజమైన రాజకీయ బలమని శిల్పా రవి స్పష్టం చేశారు.

టీడీపీ విజయం అని ప్రచారం చేసుకోవచ్చు.. కానీ ఆ విజయానికి వెనుక ఉన్న వాస్తవాలను ప్రజల నుంచి దాచలేరు. ప్రలోభాలకు తలవంచని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల పోరాట స్ఫూర్తి ఎప్పటికీ గర్వకారణమే! అని శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే ప్రజల్లోకి.. కార్పొరేటర్ ఆళ్ళ శిరీష..

గుంటూరు, పెన్ పవర్,నవంబర్, 26,

గుంటూరు నగరపాలక సంస్థ 30వ డివిజన్ కార్పొరేటర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే ఆళ్ళ శిరీష ప్రజల్లోకి వెళ్లి డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం ఉదయం గుండారావుపేటలోని ప్రధాన వీధులు, కాలనీలు, మురికివాడల్లో కాలినడకన పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి రావడం, తాగునీటి సరఫరాలో అంతరాయం, రంగు మారిన నీరు సరఫరా కావడం, వీధి దీపాలు వెలగకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రివేళల్లో మహిళల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను వెంటనే సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆళ్ళ శిరీష, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో



అధికారులను స్వయంగా పిలిపించి సమస్యలను క్షేత్రస్థాయిలో చూపించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆళ్ళ శిరీష మాట్లాడుతూ.. ప్రజలు తమకు ఇచ్చింది కేవలం పదవి కాదని, ఎంతో బాధ్యత అని అన్నారు. కుర్చీలకు పరిమితం కాకుండా ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. 30వ డివిజన్‌ను గుంటూరులోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్ళా మాధవిల సహకారంతో కృషి చేస్తామని



తెలిపారు.

జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ.. ఆళ్ళ శిరీష కార్పొరేటర్‌గా విజయం సాధించడం 30వ డివిజన్ ప్రజల విజయమని అన్నారు. తామిద్దరం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో డివిజన్ కూటమి నాయకులు మెహబూబ్ భాష, గంధం బాబ్జి, అప్పిశెట్టి రంగా, స్వామి, బాలకృష్ణ, బద్రి, ఫణి, కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాపారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

పెన్ పవర్ నవంబర్ 25

ధర్మారం గ్రామ పంచాయతీలో ఈరోజు గ్రామ సర్పంచ్ దాసరి మణిదీపక్ గారి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించడం జరిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి మణిదీపక్ గారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, వారి కుటుంబాలకు భరోసా లభిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భీమారం మండల ఎంపీడీఓ వీణా మేడం, ఎంపీవో సతీష్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రావణ్, గ్రామ ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ మేయర్ల వేదికలో గుంటూరు మేయర్, కమిషనర్..

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 25,



ముంబైలో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ మేయర్ల వేదిక--2026 తొలి రోజు సమావేశాల్లో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొన్నారు.ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో పట్టణాభివృద్ధి, కృత్రిమ మేధ వినియోగం, ఆధునిక నగర పాలన, వ్యర్థాల నిర్వహణ, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.2047 నాటికి నగరాల రూపురేఖల మార్పు, ప్రపంచ నగరాల మధ్య సహకారం, ప్రజలకు మెరుగైన పట్టణ సేవలు అందించడం వంటి అంశాలపై వివిధ దేశాల మేయర్లు, నిపుణులతో అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సదస్సు ద్వారా గుంటూరు నగర అభివృద్ధికి ఉపయోగపడే ఉత్తమ విధానాలు, అంతర్జాతీయ అనుభవాలను తెలుసుకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు.

హత్యకు గురైన గిరిజన యువకుడి కుటుంబానికి అండగా ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప..

విజయవాడ, పెన్ పవర్,నవంబర్, 25,

ఎన్టీఆర్ జిల్లా నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీరులపాడు మండలం గోకరాజుపల్లి గ్రామానికి చెందిన గిరిజన యువకుడు తిమ్మసత్తి నరేష్ హత్యకు గురికావడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన నరేష్ కుటుంబాన్ని పరామర్శించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందాల్సిన న్యాయం, పరిహారం, సంక్షేమ ప్రయోజనాలు కల్పించేలా ఎస్టీ కమిషన్ తరఫున అండగా నిలిచారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారం బాధిత కుటుంబానికి ప్రభుత్వం మొత్తం రూ.8,25,000 పరిహారం మంజూరు చేసిందని, అందులో మొదటి విడతగా 50 శాతం మేర రూ.4,12,500 విడుదల చేసినట్లు తెలిపారు.

అంతేకాకుండా బాధిత కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, కుటుంబానికి ఇంటి స్థలం, వ్యవసాయ భూమి మంజూరు చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెల్లడించారు.రాష్ట్రంలో ఎక్కడైనా గిరిజనులపై దాడులు, అన్యాయాలు, హత్యలు జరిగినప్పుడు ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని, వారికి చట్టపరంగా రావాల్సిన న్యాయం, పరిహారం, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తుందని పి. వెంకటప్ప స్పష్టం చేశారు. గిరిజనుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఎస్టీ కమిషన్ నిరంతరం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇ.వి.ఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్..





గుంటూరు, పెన్ పవర్,నవంబరు 25 :

జిల్లా కేంద్రంలోని ఇ.వి.ఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ బుధవారం తనిఖీ చేశారు. ఇ.వి.ఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్‌లను పరిశీలించారు. ఇ.వి.ఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె.ఖాజావలి,

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణా రెడ్డి, రహదారులు భవనాలు శాఖ డిఇ హజరతయ్య, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, తహసిల్దార్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి ప్రజలకు సంజీవని వైద్య సేవలు అందించేందుకు సన్నాహాలు.. కలెక్టర్

విజయవాడ:పెన్ పవర్,నవంబర్ 25,

ఈ కార్యక్రమాన్ని జనవరి 1, 2027 నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం విస్తృత స్థాయిలో సన్నాహాలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న సంజీవని కార్యక్రమం నాలుగో విడత శిక్షణను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. శిక్షణలో పాల్గొంటున్న వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య అధికారులతో మాట్లాడి శిక్షణ కార్యక్రమం పురోగతిని, అందిస్తున్న అంశాలను సమీక్షించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే అవసరమైన శిక్షణ, సన్నద్ధత, సమన్వయ చర్యలను పూర్తి చేసుకుని ప్రజలకు సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సంజీవని కార్యక్రమం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. శిక్షణ పొందుతున్న వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య అధికారులు ప్రతి అంశాన్ని శ్రద్ధగా, సమగ్రంగా నేర్చుకోవాలని సూచించారు.





శిక్షణలో పొందిన క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వినియోగిస్తూ, కార్యక్రమ అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో, నాణ్యతతో అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రవణ్ బాబు మాట్లాడుతూ, సంజీవని కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల పరిపాలనా అధికారి నారాయణ, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నవీన్, జిల్లా కార్యక్రమ అధికారి మహేష్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ కార్తీక్, టాటా సంస్థ తరఫున సత్యనారాయణ, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషితోనే రెండేళ్లలో ఎన్నో విజయాలు..కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,పెన్ పవర్, నవంబర్, 25,



టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషి, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతోనే గత రెండేళ్లలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయగలిగామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.

డా. జి.లక్ష్మీశ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి బుధవారం నాటికి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పలువురు జిల్లా అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం, మహిళా సాధికారత, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ వికాస, ఇగ్నైట్ సెల్ కార్యక్రమాలకు స్కోచ్ అవార్డులు, ఆకాంక్షిత మండలాలకు నీతి ఆయోగ్ గుర్తింపు, గుంటుపల్లి రైజ్ కేంద్రం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం వంటి విజయాలు టీమ్ ఎన్‌టీఆర్ కృషికి నిదర్శనమన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యంగా వివిధ శాఖల పనితీరును 563 కీలక పనితీరు సూచీల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లుతెలిపారు.పారిశ్రామికాభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కులు, యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రతన్‌టాటాఇన్నోవేషన్‌హబ్‌తోఅనుసంధానం వంటి కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు.దసరా ఉత్సవాలు, సరస్ మేళా వంటి భారీ కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టగలిగామని పేర్కొన్నారు. ఈ విజయాల వెనుక ప్రతి అధికారి, ఉద్యోగి కృషి ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సమష్టిగా పనిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం. కలెక్టర్ .సి.యం. సాయికాంత్ వర్మ

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 25:



జిల్లాలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటిఎంసీ), పొన్నూరు మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు.ఎంటిఎంసీలో 62 వార్డులు, పొన్నూరు మున్సిపాలిటీలో 40 వార్డులు కలిపి మొత్తం 102 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 345 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు పట్టణ స్థానిక సంస్థల్లో కలిపి 2,97,913 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 2,201 మంది సిబ్బందిని నియమించారు.నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎంటిఎంసీ ఎన్నికల కౌంటింగ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో, పొన్నూరు మున్సిపాలిటీకి సెయింట్ ఆన్స్ పాఠశాలలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కూడా కల్పించారు.ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎంటిఎంసీ, పొన్నూరు ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మధుమేహ నియంత్రణకు జీవనశైలి మార్పులు ఎంతో కీలకం -- డాక్టర్ దాసరి చంద్రశేఖర్



పర్చూరు (ఉప్పుటూరు), నవంబర్ 25, (పెన్ పవర్)

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతోందని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లు, వైద్యుల సూచనలు పాటించడం ద్వారామధుమేహాన్నిసమర్థవంతంగానియంత్రించుకోవచ్చనితెలిపారు.

ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఉప్పుటూరుగ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద టైప్-1, టైప్-2 మధుమేహ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మధుమేహం ప్రధానంగా రెండు రకాలుగాఉంటుందనివివరించారు.టైప్ 1మధుమేహంసాధారణంగాచిన్నపిల్లలు, యువతలో కనిపిస్తుందని, శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గడం లేదా నిలిచిపోవడం దీనికి కారణమని చెప్పారు. టైప్-2 మధుమేహం అధికంగా పెద్దవారిలో కనిపిస్తుందని, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, జన్యుపరమైన కారణాలు దీనికి దోహదపడతాయని వివరించారు.తరచూ మూత్రవిసర్జన, అధిక దాహం, ఆకలి పెరగడం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, నీరసం, చూపు మందగించడం, గాయాలు త్వరగా మానకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. వ్యాధిని అదుపులో ఉంచుకోకపోతే గుండె, మూత్రపిండాలు, కంటి చూపు, నరాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మధుమేహ నియంత్రణకు ప్రతిరోజూ కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు నడక, యోగా లేదా వ్యాయామం చేయాలని, తీపి పదార్థాలు, మైదా వంటకాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 30 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించినప్పుడు సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, వైద్యశాలకు వచ్చిన రోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులకు ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకోండి. కమిషనర్ మయూర్ అశోక్..





గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 25,

నగర ప్రజలు పన్నుల చెల్లింపుల్లో పారదర్శకతతో పాటు వేగవంతమైన సేవలు పొందేందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్నులు చెల్లించేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే సులభంగా చెల్లించే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక పరిపాలన శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆస్తి పన్ను, నీటి పన్ను, మురుగునీటి పన్ను, వ్యాపార అనుమతి రుసుములను చెల్లించవచ్చని తెలిపారు.ఈ విధానం ద్వారా సెలవు రోజులతో సంబంధం లేకుండా ఎప్పుడైనా నిమిషాల వ్యవధిలో పన్నులు చెల్లించవచ్చని, వెంటనే రసీదు కూడా పొందవచ్చని వివరించారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు చెల్లింపుల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.

నగర అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ పన్నులను సకాలంలో చెల్లించి గుంటూరు నగర ప్రగతికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: బలసాని కిరణ్ కుమార్

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 25:

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించి, నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే ఆసక్తులను గుర్తించి, ఆ దిశగా శిక్షణ కల్పించాలి.. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 25,

చిన్ననాటి నుంచే పిల్లలకు ఉన్న ఆసక్తులు, అభిరుచులను గమనించి, వాటికి అనుగుణంగా శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్న 10 సంవత్సరాల చిన్నారి మల్లిపెద్ది దక్ష బుధవారం తన తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోడాక్టర్‌జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నిర్వహించిన పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన మెడల్‌ను జిల్లా కలెక్టర్‌కు చూపించడంతో పాటు, తాను స్వయంగా తయారు చేస్తున్న పూసల బ్రాస్లెట్లను ప్రదర్శించారు. కాన్వాస్‌పై పెయింటింగ్ వేయడం, వివిధ రంగులు, పూసలు, ఇతర మెటీరియల్‌తో ఆకర్షణీయమైన బ్రాస్లెట్లను తయారు చేయడంలో దక్ష చూపుతున్న ప్రతిభను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారి దక్షను పూసల బ్రాస్లెట్ల తయారీ



విధానం, వాటికి ఉపయోగిస్తున్న మెటీరియల్‌ను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు తదితర వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చిన్నారి తయారు చేసిన బ్రాస్లెట్లు చాలా బాగున్నాయని ప్రశంసించారు. బ్రాస్లెట్ల తయారీతో పాటు మరింత వినూత్నంగా, సృజనాత్మకంగా ఏయే వస్తువులను తయారు చేయవచ్చో ఆలోచించి, కొత్త ప్రయోగాలు చేయాలని చిన్నారికి సూచించారు. తనలోని ప్రతిభను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక సృజనాత్మకత అంతర్గతంగా ఉంటుందని, దానిని గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ తెలిపారు. పిల్లలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించేందుకు అవసరమైన అవకాశాలు కల్పిస్తే, వారు భవిష్యత్తులో ప్రతిభావంతులుగా ఎదగడమే కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే ఔత్సాహికవేత్తలుగా కూడా మారగలరని పేర్కొన్నారు. చిన్నారి దక్షలోని సృజనాత్మకతను గుర్తించి, ఆమెను చిన్ననాటి నుంచే ప్రోత్సహిస్తున్న తల్లి ఎం.శైలజను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. దక్ష భవిష్యత్తులో మరింత ప్రతిభను కనబరిచి, మంచి ఔత్సాహికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి దక్ష తల్లిదండ్రులు ఎం.సుమన్, ఎం.శైలజ, తమ్ముడు ఎం.సూర్య పాల్గొన్నారు.

బాలలపై వేధింపులు, దోపిడీని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమం..గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్



విజయవాడ , పెన్ పవర్,నవంబర్ 25:

తాడేపల్లి మండలం ప్రాతూరు గ్రామంలోని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం బాలబాలికలకు బాలల రక్షణ, వేధింపులు, దోపిడీని అరికట్టే మార్గాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అత్తోట పోతురాజు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో బాలలపై వివిధ రూపాల్లో హింస, దోపిడీ, శారీరక, మానసిక, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పెద్దల సహకారం ఎంతో అవసరమని అన్నారు. బాలల సమస్యలను గుర్తించి వారికి తగిన కౌన్సెలింగ్, భరోసా కల్పించాలని సూచించారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు సమాజంలోని



ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

18 సంవత్సరాల లోపు పిల్లల శారీరక, మానసిక, లైంగిక భద్రతకు భంగం కలిగించే ఏ ఘటననూ నిర్లక్ష్యం చేయకూడదని, బాలలపై వేధింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించాలని తెలిపారు. ఆపదలో ఉన్న పిల్లల సహాయం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే 1098 చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌ను, అత్యవసర పోలీసు సహాయం కోసం 112 లేదా 100 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

అలాగే, బాలలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం-2012 అమలులో ఉందని, ఈ చట్టం ద్వారా నిందితులకు కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ బాలల పార్లమెంట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని కూల్చి వేయాలని జగన్మోహన్ రెడ్డి అనుమతి ఇచ్చారు
టీడీపీ పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 25,



ఒక ప్రభుత్వంలోని ఆలయాన్ని పోల్చాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుమతి ఇచ్చారు,

గత వైసీపీ హయాంలో రాముడి విగ్రహం తల నరికి, దేవాలయాలను కూల్చి, రథాలను తగులబెట్టిన గొడ్డలి పార్టీ.. నేడు కూటమి హయాంలో విచ్చల విడిగా గుడులు కూలుస్తున్నారంటూ విష ప్రచారానికి దిగుతోందిదని లక్ష్మయ్య అన్నారు,ఆంజనేయపురం ఆంజనేయస్వామి గుడి కూల్చివేతకు 2023లో అనుమతులు ఇచ్చిన గత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి... నేడు అదే ఆలయం కూలుస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాజీ శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి హిందువుల మనోభావాలు దెబ్బతీయాలని దుర్మార్గమైన ఆలోచనతో ఈరోజు ఆంజనేయపు రంలో ఆంజనేయుడి ఆలయం కూల్చివేత అంటూ వైసీపీ చేస్తున్నది దుష్ప్రచారమే. ఆలయ కూల్చివేత జరగలేదు.. గ్రామస్తులు, భక్తుల అనుమతితోనే శాస్త్రోక్తంగా మూలవిరాట్టును వేరే చోటికి తరలించి ప్రతిష్టించాం. నూతన ఆలయ నిర్మాణానికి మన ప్రభుత్వం 50 సెంట్ల స్థలం, రూ. 59 లక్షల నిధులు ఇచ్చింది. వైసిపి నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాజీ శాసనసభ్యులు భూముల కరుణాకర్ రెడ్డి చెబుతున్న తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు
1,000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు.. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ.. అత్యవసర పరిస్థితుల్లో సమర్థ్ యాప్ ద్వారా తక్షణ స్పందన
బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

చీరాల, నవంబర్ 25, (పెన్ పవర్) :

మొదటి విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా సుమారు 1,000 మంది పోలీసులను మోహరించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుధవారం చీరాల పట్టణంలోని ఎన్.ఆర్ అండ్ పి. మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి విధులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బందోబస్తు ప్రణాళిక, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమర్థ్ మొబైల్ యాప్ వినియోగంపై వివరించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు, చిన్నగంజాం, కారంచేడు మండలాల్లో మొత్తం 95 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని ఎస్పీ తెలిపారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 920 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 259 పోలింగ్ కేంద్రాల్లో 17 అత్యంత సమస్యాత్మక, 61 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పోలింగ్ కేంద్రాలను 39 రూట్లుగా విభజించి ప్రతి



రూట్‌కు మొబైల్ పోలీస్ పార్టీని నియమించడంతో పాటు 34 స్ట్రైకింగ్ పార్టీలు, 12 ప్రత్యేక స్ట్రైకింగ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. 12 మంది సీఐలు, 33 మంది ఎస్ఐల పర్యవేక్షణలో మొత్తం వెయ్యి మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాలపై సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు.పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఉదయం 6 గంటలకే విధులకు సిద్ధంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో జనసమూహాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లు క్రమపద్ధతిలో ఓటు వేసేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు సమయంలోనూ కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కొనసాగించాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ మొబైల్ ఫోన్లలో సమర్థ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని లాగిన్ అయి సిద్ధంగా ఉండాలని



ఎస్పీ సూచించారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే యాప్‌లోని యస్ ఒ యస్ బటన్ ద్వారా సమాచారం పంపవచ్చని తెలిపారు. దీనివల్ల సమీపంలోని మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ బలగాలు, జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తక్షణ సమాచారం చేరుతుందని వివరించారు. సంఘటన స్థలానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వాయిస్ రికార్డింగ్‌తో పాటు సిబ్బంది లొకేషన్ వివరాలు కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తద్వారా సమస్య తలెత్తిన ప్రాంతాలకు పోలీస్ బృందాలు వేగంగా చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చన్నారు.

ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఎన్నికల విధులకు హాజరైన సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం
ఈ నెల 27న శుక్రవారం నిర్వహణ.. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్.వి. రఘునందన్ ఆధ్వర్యంలో పరీక్షలు

చీరాల, నవంబర్ 25, (పెన్ పవర్) :

బాపట్ల జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో క్యాన్సర్ చికిత్స అందిస్తున్న హెచ్ సి జి యమ్ ఎన్ ఆర్ క్యాన్సర్ సెంటర్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో, గవర్నమెంట్ హాస్పిటల్ చీరాల వారి సహకారంతో ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆర్.వి. రఘునందన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరగనుంది. చీరాలలోని గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.ప్రతి నెల నాలుగో శుక్రవారం నిర్వహించే క్యాన్సర్ వైద్య శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు, అనుమానం ఉన్నవారు, వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాలకు 96520 66322 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

హక్కుల కోసం గత తరాల మహిళల పోరాట ఫలితమే నేటి స్వేచ్ఛ
వేధింపులపై మహిళలు మౌనం వీడాలి: చెరుకూరి సృజన

చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, నవంబర్ 25 :

మహిళలు నేడు అనుభవిస్తున్న హక్కులు, స్వేచ్ఛ గత తరాల మహిళలు దశాబ్దాలపాటు సాగించిన పోరాటాలు, చేసిన త్యాగాల ఫలితమని యడ్లపాడు నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన పేర్కొన్నారు. మహిళలపై హింసను అరికట్టేందుకు చట్టాలపై అవగాహనతోపాటు, అన్యాయాన్ని ధైర్యంగా ప్రశ్నించే చైతన్యం ప్రతి ఒక్కరిలోనూ రావాలని పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మహిళలపైహింసనిర్మూలనదినోత్సవాన్నిపురస్కరించుకుని చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెరుకూరి సృజనమాట్లాడుతూనవంబర్25వ తేదీ ప్రాధాన్యతను వివరించారు. నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన ముగ్గురు మహిళల స్మారకంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి, మహిళలపై హింస నిర్మూలన దినోత్సవానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. మహిళలపై జరుగుతున్నహింసనుఅరికట్టేందుకుప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల హక్కులు, రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి, నారింజ రంగు రిబ్బన్లు ధరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నినాదాలద్వారాప్రజల్లో చైతన్యం కల్పించడంతోపాటు మానవహారం చేపట్టారు.జవేరా బీఈడీ కళాశాల కరస్పాండెంట్ తోటకూర వెంకటనారాయణ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామసీత మాట్లాడుతూ బాలికలు, మహిళలకు గౌరవం, భద్రత, సమానత్వం హక్కులుగా గుర్తించాలని, ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఖండించాలని సూచించారు. తమకు ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.

చిలకలూరిపేట రోటరీ క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ గళ్లా సాంబశివరావు దేశంలోని ధీరవనితల చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరేశ్వరరావు, ఉపాధ్యాయురాలు స్నేహలతారెడ్డి, తోటకూర శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రమాదం.. విద్యార్థులకు తీవ్ర గాయాలు!
గోడ కూలి విద్యార్థులపై పడటంతో కలకలం.. రిహాన్‌కు 28 కుట్లు



స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై విద్యార్థి తండ్రి ఆగ్రహం.

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 25 :

చిలకలూరిపేటలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో గోడ కూలి ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన ఘటన కలకలం రేపింది. పాఠశాల ఆవరణలో గోడ కూలి పడటంతో విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో రిహాన్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి.కూలిన గోడకు సంబంధించిన సిమెంట్ రాళ్లు రిహాన్ కాలి భాగంపై పడటంతో తీవ్ర గాయమైంది. దీంతో ఆసుపత్రికి తరలించిన వైద్యులు గాయమైన కాలికి 28 కుట్లు వేసినట్లు సమాచారం. గాయం తీవ్రత కారణంగా విద్యార్థి అయోమయంగా ప్రవర్తిస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని విద్యార్థి తండ్రి ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరితే, స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ, "నీకు చేతనైంది చేసుకో" అంటూ బెదిరించిందని ఆయన ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థుల భద్రతపై ఇంతటి నిర్లక్ష్యం ఎందుకని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.ఘటనపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని,బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి తండ్రి వేడుకుంటున్నారు.

కొండపల్లి చెక్కబొమ్మల కళకు పూర్వవైభవం..420 మంది కలెక్టర్ డా. జి. లక్ష్మీశ..

విజయవాడ, పెన్ పవర్,నవంబర్, 25,

కొండపల్లి సంప్రదాయ చెక్కబొమ్మల కళకు పూర్వవైభవంతీసుకురావడంతో పాటు, కళాకారులకు మెరుగైనఉపాధి,ఆదాయ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం కింద కొండపల్లి బొమ్మల పునరుజ్జీవనం, ప్రోత్సాహానికి రూ. 20 లక్షల ప్రాజెక్టుకు ఆమోదం లభించడం కీలక ముందడుగని పేర్కొన్నారు.బుధవారం కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, బొమ్మల తయారీ ప్రక్రియ, కళాకారుల నైపుణ్యాలు, సంప్రదాయ కళ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీతి ఆయోగ్



ప్రాజెక్టు ద్వారా కొండపల్లి బొమ్మల తయారీపై ఆధారపడిన 420 మంది కళాకారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సంప్రదాయ కళను పరిరక్షించడంతో పాటు, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కళాకారుల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.కొండపల్లి బొమ్మలకు ప్రత్యేక బ్రాండింగ్, పర్యావరణహిత ప్యాకేజింగ్, డిజిటల్



మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, మెరుగైన మార్కెట్ అనుసంధానం కల్పించడం ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తద్వారా కళాకారుల ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించడంతో పాటు వారి ఆదాయం కూడా పెరుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలిసారి...వాళ్లకు రక్షణగా కూటమి చట్టం



ఏపీలో పెట్టుబడిదారులకు భరోసా కల్పించేలా చంద్రబాబు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దేశంలోనే తొలిసారిగా ప్రతిపాదిస్తున్న ఈ పెట్టుబడుల పరిరక్షణ బిల్లును డిసెంబర్ 5 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారినా గతంలో కుదుర్చుకున్న పారిశ్రామిక ఒప్పందాలు, భూములు, రాయితీలకు రక్షణ కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం.

ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సరి కొత్త చట్టాన్ని తీసుకుని వస్తోంది. ఇది దేశంలోనే తొలిసారి. ఇలాంటి చట్టం ఒకటి చేయాలన్న ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం వినూత్నంగా ఆలోచన చేసింది. దీంతో రాష్ట్ర ప్రగతి ముడిపడి ఉండడం విశేషం. ఎందుకంటే ఏపీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు వస్తున్నారు. ఆయా ప్రాజెక్టులు గ్రౌండ్ అయి ఫలితాలు వచ్చేందుకు సమయం పడుతుంది. ఈలోగా ప్రభుత్వం మారితే ఇబ్బందులు వస్తాయి. అందువల్ల ప్రభుత్వ నిర్ణయాలకు స్థిరత్వం ఉండాలి. ఎక్కడైనా పెట్టుబడిదారులు ఇదే కోరుకుంటారు. ఇక దేశంలో చూస్తే వివిధ రాష్ట్రాల్లో గత ప్రభుత్వ విధానాలను ముఖ్యంగా రాష్ట్ర ప్రగతికి సంబంధించి కొనసాగించేందుకు చూస్తున్నారు. ఏపీలో మాత్రం పునస్సమీక్షకు గురి అవుతున్నాయి. అందుకే పెట్టుబడిదారులకు రక్షణ కవచంగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం చట్టం తీసుకుని వస్తోంది.

కొత్త ఆలోచనగా :

ఇదిలా ఉంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన పెట్టుబడుల పరిరక్షణ చట్టం దేశంలోనే మొట్టమొదటిదిగా చెబుతున్నారు. ఇటీవలనే విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చట్టాన్ని తీసుకురాబోతున్నట్లుగా ప్రకటించారు. ఇక డిసెంబర్ లో జరిగే ఏపీ అసెంబ్లీ శీతాకాల సమావేశాలలో ఈ చట్టం ఆమోదిస్తారని అంటున్నారు. దాంతో ఈ చట్టం గురించి అంతా ఆసక్తిని చూపిస్తున్నారు. విషయానికి వస్తే ఇంతదాకా ఏ రాష్ట్రంలోనూ కేంద్ర స్థాయిలోనూ ప్రభుత్వాలు మారినప్పుడు పారిశ్రామిక ఒప్పందాలను కాపాడేందుకు ప్రత్యేకంగా ఇలాంటి చట్టం లేదని తెలుస్తోంది. ఇక ఏపీలో ఈ చట్టాన్ని అమలు చేయడంతో పాటు దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులలో విశ్వాసం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో ఇలాంటి చట్టం తీసుకురావాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూటమి ప్రభుత్వం సీఐఐ సదస్సు వేదికగా కోరింది.

చట్టంలో ఏముంది :

ఇదిలా ఉంటే డిసెంబర్ 5 నుంచి ఏపీ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలలో ఈ బిల్లుని ప్రవేశపెడతారు అని అంటున్నారు. ఇక ఈ చట్టం గురించి ఆలోచించినపుడు సాధారణంగా ఒక రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడు గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయడం లేదా సమీక్షించడం వల్ల పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ రాజకీయ అనిశ్చితిని తొలగించి పెట్టుబడులకు శాశ్వత భరోసా కల్పించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశంగా చెబుతున్నారు. ఇక ఈ చట్టం చేయడం ద్వారా ప్రధాన రక్షణల గురించి ఆలోచిస్తే కనుక రాష్ట్రంలో అధికార పార్టీ మారినా కొత్తగా వచ్చే ప్రభుత్వం పాత ప్రభుత్వం చేసుకున్న పారిశ్రామిక ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయడానికి వీలుండదు అని అంటున్నారు. అలాగే పరిశ్రమలకు ప్రభుత్వం కేటాయించిన భూములు, అలాగే భూమి, నీటి ధరలకు సంబంధించి ఇచ్చిన హామీలకు చట్టబద్ధమైన రక్షణ ఉంటుందని చెబుతున్నారు.

వాటికి గ్యారంటీ :

అదే విధంగా ఏపీలో ఆయా పరిశ్రమల స్థాపన సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక ఆర్థికేతర రాయితీలు కానీ మౌలిక సదుపాయాల కల్పన హామీలు కచ్చితంగా అమలయ్యేలా ఈ చట్టం చూస్తుందని అంటున్నారు. అలాగే పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులు సకాలంలో అందేలా ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతా విధానాన్ని కూడా కూటమి ప్రభుత్వం జతచేస్తోంది. ఒక విధంగా చూస్తే రాజకీయ కారణాలతో పరిశ్రమలపై వేధింపులు లేకుండా అనుమతుల విషయంలో పారదర్శకత ఉండేలా ఈ చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని అంటున్నారు. అదే సమయంలో ఈ చట్టం కింద రక్షణ పొందే కంపెనీలకు కొన్ని నిబంధనలు కూడా ఉంటాయని అంటున్నారు. తమకు కేటాయించిన భూమిని కేవలం ఆమోదించిన ప్రాజెక్టు అవసరాలకు మాత్రమే వారు వినియోగించాల్సి ఉంటుంది. ఇక నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒక వేళ కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రభుత్వం భూ కేటాయింపులను రద్దు చేసే అధికారం కూడా ఈ చట్టంలో పొందుపరుస్తున్నారు. మొత్తానికి ప్రభుత్వం మారినపుడల్లా పెట్టుబడులు వెనక్కి మళ్ళిపోయే విధంగా ఉండే రాజకీయ సయ్యాట నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది అని అంటున్నారు.

ఒకే క్లిక్‌తో 10 లక్షల మందికి సందేశం..

టీడీపీని నడిపిస్తున్న డిజిటల్ వెన్నెముక



నారా లోకేశ్ అభివృద్ధి చేసిన మైటీడీపీ యాప్ ద్వారా 10 లక్షల మంది కార్యకర్తలు ఒకే డిజిటల్ వేదికపైకి వచ్చారు. అధినేత సందేశాలు, పార్టీ సూచనలు క్షణాల్లో చేరడంతో పాటు, కార్యకర్తల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు నేరుగా అధిష్ఠానానికి చేరుతున్నాయి. పార్టీ బలోపేతానికి ఈ యాప్ కీలకంగా మారింది.దేశంలోని ప్రతి పార్టీకి డిజిటల్ వేదికలు, మొబైల్ యాప్‌లు ఉన్నాయి. అగ్రనాయకుల ప్రసంగాలు, పార్టీ ప్రకటనలను కింది స్థాయికి చేరవేసేలా ఈ డిజిటల్ మాధ్యమాలను ఉపయోగిస్తుంటారు. దాదాపు ప్రతిపార్టీ ఇదే విధానం అనుసరిస్తుండగా, టీడీపీ మాత్రం భిన్నమైన పంథాను అనుసరిస్తూ డిజిటల్ టెక్నాలజీలో సరికొత్త పుంతలు తొక్కుతోందని విశ్లేషిస్తున్నారు.

ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కునే లక్ష్యంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దూరదృష్టితో అభివృద్ధి చేసిన మైటీడీపీ యాప్ ఇప్పుడు ఆ పార్టీకి బలమైన సైన్యాన్ని తయారు చేసిందని అంటున్నారు. కార్యకర్త నుంచి అధినేత వరకు ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా అనుసంధానం కల్పించే ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థగా మైటీడీపీ యాప్ ను అభివృద్ధి చేసి టీడీపీ సరికొత్త రికార్డులు నమోదు చేసిందని అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వంలో రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించిన అనుభవంతో, పార్టీలోనూ అదే తరహా వేగవంతమైన స్పందన ఉండేలా లోకేశ్ మై టీడీపీ యాప్‌ను తీర్చిదిద్దినట్లు చెబుతున్నారు. దీని ద్వారా పార్టీ అధినేత సందేశాలు, నాయకత్వ సూచనలు క్షణాల్లో 10 లక్షల మంది కార్యకర్తలకు చేరడంతో పాటు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, స్థానిక సమస్యలు నేరుగా పార్టీ అధిష్ఠానానికి చేరుతున్నాయి. పార్టీ తీసుకునే నిర్ణయాలు, కార్యక్రమాల రూపకల్పనలో కార్యకర్తల స్పందనను ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాకుండా, వారి విలువైన సూచనలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఈ వేదికను రూపొందించారు. తద్వారా పార్టీ విధాన నిర్ణయాల్లో సామాన్య కార్యకర్త కూడా భాగస్వామి అయ్యే అవకాశం లభించింది.

కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను పర్యవేక్షించేందుకు కూడా 'మైటీడీపీ'లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతుల నిర్వహణతో పాటు, సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు. ఒకే పసుపు కుటుంబంగా 10 లక్షల మంది కార్యకర్తలు ఒకే డిజిటల్ వేదికపైకి రావడం వల్ల, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం మరింత వేగంగా, సమన్వయంతో పనిచేయడానికి వీలు కలిగింది.

రాబోయే రోజుల్లో రాజకీయ పోరాటాలు, ఎన్నికల వ్యూహాలు పూర్తిగా డేటా మరియు సాంకేతికత ఆధారంగానే నడవనున్నాయి. ఈ వాస్తవాన్ని ముందుగానే గుర్తించిన నారా లోకేశ్, 'మైటీడీపీ' ద్వారా పార్టీకి ఒక బలమైన డిజిటల్ వెన్నెముకను నిర్మించారు. కార్యకర్త కష్టానికి గుర్తింపు, ప్రతిభకు ప్రోత్సాహం, అంకితభావానికి తగిన అవకాశాలు కల్పిస్తూ రూపొందించిన ఈ సమగ్ర వ్యవస్థ, రాబోయే దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి ఒక తిరుగులేని పునాదిగా నిలవనుంది.

జనసేన 'కట్టు' తప్పుతోంది: సాగదీతే కారణమా.. ?



మున్సిపల్ ఎన్నికల్లో కాకినాడ, నిడదవోలు, పార్వతీపురం, ఆత్మకూరులో జనసేన నేతల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. కొందరు పార్టీ నిర్ణయాలను ధిక్కరించగా, మరికొందరు వైసీపీతో చేతులు కలిపారనే ఆరోపణలు వచ్చాయి. అభ్యర్థుల ఎంపికలో జాప్యం, క్షేత్రస్థాయి నివేదికల్లో లోపాలపై కూడా చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం విచారణ చేపట్టినట్లు సమాచారం.రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ ఎన్నికల వేళ.. జనసేన నాయకులు వ్యవహరించిన తీరు.. పార్టీ క్రమ శిక్షణపై తీవ్ర ప్రభావం పడేలా చేసిందని అంటున్నారు విశ్లేషకులు. కాకినాడ, నిడదవోలు వంటి జనసేన పార్టీ బలంగా ఉన్న స్థానాల్లో కూడా.. పెద్ద ఎత్తున వివాదాలు చోటు చేసుకోవడం.. పార్వతీపురం మన్యంలో జనసేన నాయకులు వైసీపీతో చేతులు కలపడం.. ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయరెడ్డి జనసేన నాయకులను తనవైపు తిప్పు కొన్నారన్న ఆరోపణలు వినిపించడం వంటివి పార్టీలో చర్చకు దారితీశాయి.

మరీ ముఖ్యంగా నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌లకు ఎదురైన అనుభవాలు పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఇరకాటంగా మారాయి. ముందుగానే ఎంపిక చేసిన అభ్యర్థులను చైర్మన్, వైస్‌చై ర్మన్ పీఠాలపై కూర్చోబెట్టే క్రతువు వివాదంగా మారడంతోపాటు.. ఆయా కీలక నాయకులకు సెగ పెంచేలా చేసింది. పార్టీ అధిష్టానమే చెప్పినప్పటికీ.. నేను వినేది లేదంటూ.. నిదదవోలు జనసేన నాయకుడు ప్రకటన చేయడం మరో కొసమెరుపు. ఇక, మంత్రి ఆనంతో చెట్ట పట్టాలేసుకుని తిరిగి.. పార్టీ విప్‌ను కూడా ధిక్కరించారు.వాస్తవానికి క్షేత్ర స్థాయిలో అన్ని విషయాలను పరిశీలించిన తర్వాతే.. చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులను ఖరారు చేశామని.. వారికి మాత్రమే బీఫాం ఇచ్చామని పార్టీ అధినేత చెబుతున్నారు. కానీ, దీనిని కొందరు తప్పు బట్టారు. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితికి భిన్నంగా వ్యవహరించారని.. పైగా అభ్యర్థుల ఎంపిక వ్యవహారాన్ని కూడా చాలా కాలం సాగదీశారనే వాదన వినిపించింది. ఇది అంతిమంగా ఆశావహులను రెచ్చిపోయేలా చేసిందన్న చర్చ సాగుతోంది. పైగా.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికల్లోనూ తప్పులు ఉన్నాయమని సాక్షాత్తూ జనసేన మంత్రి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

ఈ పరిణామాలకు తోడు.. ఏకంగా వైసీపీతోనే చేతులు కలిపి.. పార్వతీపురంలో పదవి చేపట్టేందుకు ప్రయత్నించ డం మరింత దుమారం రేపింది. ఆయా అంశాల పై ప్రస్తుతం విచారణ సాగుతోందని చెబుతున్నా.. దీనికి సరైన పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంటుందని అంటున్నారు. లేకపోతే.. ముమ్ముందు.. జనసేన పార్టీ నేతలు.. ఎలా వ్యవహరించినా ఎలా చేసినా .. ఏంకాదన్న సంకేతాలు ఇచ్చేసినట్టు అవుతుందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా.. పార్టీలో కట్టు తప్పుతున్న పరిస్థితిని సరిచేయాలని సీనియర్లు, మంత్రులు కూడా కోరుతున్నారు.

10 లక్షల మందితో 'మైటీడీపీ' యాప్ సరికొత్త రికార్డు.. లోకేశ్ డిజిటల్ వ్యూహం



నారా లోకేశ్ రూపొందించిన మైటీడీపీ యాప్‌లో 10 లక్షల మంది క్రియాశీలక కార్యకర్తలు చేరినట్లు టీడీపీ ప్రకటించింది. పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలకు టాస్క్‌లు, శిక్షణ, హాజరు నమోదు వంటి సేవలను ఈ యాప్ ద్వారా అందిస్తోంది. ఫేస్ రికగ్నిషన్‌తో నాయకులతో దిగిన ఫొటోలను కార్యకర్తల ప్రొఫైళ్లకు జోడించే టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ వినూత్న ఆలోచనకు ప్రతిరూపమైన మైటీడీపీ యాప్ పది లక్షల మంది క్రియాశీలక కార్యకర్తలతో సరికొత్త రికార్డు సృష్టించింది. సాంకేతిక పరిజ్ఞానంతో కార్యకర్తలకు చేరువయ్యేందుకు తద్వారా పార్టీ అభివృద్ధికి లోకేశ్ మైటీడీపీ యాప్ ను తీసుకువచ్చారు. ఈ యాప్ ఇప్పుడు 10 లక్షల మంది క్రియాశీలక కార్యకర్తలతో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని అంటున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కార్యకర్తలు సమర్థంగా పనిచేసేలా మైటీడీపీ యాప్ దిశానిర్దేశం చేస్తుంది. ప్రతిరోజూ పార్టీ కార్యక్రమాలను ముందుగా తెలియజేయడంతోపాటు కార్యకర్తలకు ప్రత్యేక టాస్క్‌లు ఇస్తూ ప్రత్యర్థులపై పైచేయి సాధించేలా యాప్ ద్వారా పార్టీ పనిచేస్తుంది. ప్రస్తుతం ప్రతి పార్టీకి సోషల్ మీడియా యాక్టివిస్టులు ఉండగా, టీడీపీ కార్యకర్తలు మాత్రం మైటీడీపీ యాప్ ద్వారా సుశిక్షుతులైన సైనికులుగా పనిచేస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో కూడా మైటీడీపీ యాప్ ద్వారా కార్యకర్తలకు సమాచారం చేరవేసి పార్టీ అభ్యర్థుల విజయానికి టీడీపీ జాగ్రత్తలు తీసుకుందని, దీనిఅంతటికి మంత్రి లోకేశ్ కారణమంటూ కార్యకర్తలు అభినందిస్తున్నారు.సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా కొత్త తరం ఆలోచనలకు, సాంకేతికతకు పెద్దపీట వేస్తూ నారా లోకేశ్ పార్టీ నిర్మాణాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేశారనేదానికి మైటీడీపీ యాప్ నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ట్యాబ్‌లు, లైవ్ డేటా ఫీడ్స్, రియల్-టైమ్ డ్యాష్‌బోర్డులతో కోట్లాది మంది సభ్యత్వ నమోదును విజయవంతంగా నిర్వహించిన ఆయన, ఇప్పుడు 'మైటీడీపీ' ద్వారా దాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లారని చెబుతున్నారు. గతంలో మారుమూల గ్రామంలో పార్టీ జెండా మోసే కార్యకర్త పడే కష్టం అధిష్ఠానానికి చేరడం కష్టంగా ఉండేది. కానీ నేడు కార్యకర్తే కేంద్రంగా రూపొందిన ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో కార్యకర్త వేసే ప్రతి అడుగూ నేరుగా నాయకత్వానికి తెలుస్తోంది. ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలు, పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడం ద్వారా పార్టీకి, కార్యకర్తలకు మధ్య ఒక పటిష్ఠమైన డిజిటల్ వంతెన నిర్మితమైందని చెబుతున్నారు.దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో మరెక్కడా లేని విధంగా వినూత్న ఫీచర్లతో ఈ యాప్‌ను తీర్చిదిద్దారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు'ను డిజిటల్ వేదికపై నిర్వహించడంతో పాటు, కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతుల హాజరును సైతం డిజిటలైజ్ చేసి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా అధినేత చంద్రబాబు, నారా లోకేశ్ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు కార్యకర్తలు వారితో దిగే ఫొటోలు, ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా నేరుగా వారి ఫోన్లలోని 'ఫొటో బూత్' విభాగంలోకి చేరే సదుపాయం క్యాడర్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒక్కసారి యాప్‌లో తమ ముఖాన్ని స్కాన్ చేసుకుంటే చాలు, ఆ తర్వాత నాయకులతో ఎప్పుడు ఫొటో దిగినా ఆటోమేటిక్‌గా వారి ప్రొఫైల్‌లోకి చేరేలా రూపొందించిన ఈ సాంకేతికత పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.మొత్తంగా 'మైటీడీపీ' యాప్‌లో 10 లక్షల మంది భాగస్వాములు కావడం కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తెలుగుదేశం క్యాడర్ చూపుతున్న చైతన్యానికి, పార్టీ పట్ల వారికి ఉన్న అంకితభావానికి నిదర్శనంగా అభివర్ణిస్తున్నారు. విపక్షంలో ఉన్నప్పుడు కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు నేడు సాంకేతికత ద్వారా అండగా నిలుస్తూ, భవిష్యత్ రాజకీయాలకు నారా లోకేశ్ ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించారు. కార్యకర్తే పార్టీకి అసలైన బలం.. ఆ కార్యకర్తకు అండగా నిలిచే డిజిటల్ బలమే 'మైటీడీపీ' అని ఈ మైలురాయి మరోసారి రుజువు చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఇంటింటికీ వచ్చి క్షమాపణ చెబుతా: గౌతు శిరీష సంచలన వీడియో

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కళింగ కోమటి సామాజికవర్గానికి ఇస్తానని హామీ ఇచ్చిన టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష మాట నిలబెట్టుకోలేకపోయారు. కూటమి పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో ఆమె భావోద్వేగ వీడియో విడుదల చేసి క్షమాపణలు కోరారు. అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.రాజకీయాల్లో హామీలు నెరవేరనప్పుడు సాధారణంగా కారణాలు చెప్పి దాటవేయడం లేదా మరో కొత్త వాగ్దానంతో సర్దిచెప్పడం పరిపాటిగా కనిపిస్తుంది. కానీ, పలాస టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష విడుదల చేసిన ఒక భావోద్వేగ వీడియో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవి విషయంలో తాను ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయానని బహిరంగంగా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ ఆమె క్షమాపణ కోరడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎమ్మెల్యేగా తన చేతుల్లో నిర్ణయాధికారం ఉంటుందని భావించి హామీ ఇచ్చానని, అయితే కూటమి ధర్మం అడ్డు పడటంతో తన మాట నిలబెట్టుకోలేకపోయానని ఎమ్మెల్యే శిరీష చెప్పడం అందరినీ కదిలిస్తోందని అంటున్నారు.ఇటీవల జరిగిన పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయంలో వైస్ చైర్మన్ పదవిని కళింగ కోమటి (వైశ్య) సామాజికవర్గానికి ఇస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి పొత్తు ధర్మంలో భాగంగా పార్టీ అధిష్టానం ఆ పదవిని జనసేనకు కేటాయించింది. అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహించక తప్పని పరిస్థితి ఏర్పడటంతో కళింగ కోమట్లకు ఇచ్చిన హామీ నెరవేరలేదు. మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డుల్లో కూటమి 32 స్థానాలను కైవసం చేసుకుంది. వీటిలో టీడీపీ 28 వార్డుల్లో గెలుపొందగా, జనసేన మూడు స్థానాల్లో విజయం సాధించింది. అత్యధిక వార్డుల్లో గెలిచిన టీడీపీకి కాకుండా, తక్కువ స్థానాల్లో గెలిచిన జనసేనకు వైస్ చైర్మన్ పదవి దక్కడంపై స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమైంది.అయినప్పటికీ అధిష్టానం ఆదేశాలతో వైస్ చైర్మన్ పదవిని జనసేనకు వదిలేశారు. అయితే ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరకపోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇది గ్రహించిన ఎమ్మెల్యే శిరీష ప్రత్యేక వీడియో విడుదల చేశారు. వైస్ చైర్మన్ అభ్యర్థిని ఎమ్మెల్యేనే నిర్ణయిస్తారని భావించానని, కానీ అధిష్టానమే నేరుగా నిర్ణయం తీసుకుని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిందని ఆ వీడియోలో శిరీష వివరించారు. తన చేతుల్లో ఏమీ లేని పరిస్థితి ఏర్పడిందని, గౌతు కుటుంబ చరిత్రలో మాట తప్పిన సందర్భం లేదని చెబుతూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచిన కళింగ కోమటి సామాజికవర్గానికి ముఖం చూపించ లేకపోతున్నానని శిరీష పేర్కొన్నారు. తాను ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయినందుకు ఇంటింటికీ వచ్చి క్షమాపణ చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని, అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు.సాధారణంగా ఇలాంటి పరిణామాలు సంబంధిత వర్గాల్లో అసంతృప్తిని రాజేస్తాయి. అయితే మహిళా ఎమ్మెల్యే స్వయంగా క్షమాపణ కోరడంతో కళింగ కోమటి సామాజికవర్గ నాయకులు, పెద్దలు చలించిపోయారు. ఊహించని విధంగా ఎమ్మెల్యే క్షమాపణలు కోరడంతో వారంతా షాక్ కు గురయ్యారు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తిరిగి ఎమ్మెల్యేనే సముదాయించేలా మాట్లాడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. పలాస నియోజకవర్గ ప్రజలతో గౌతు కుటుంబానికి దశాబ్దాల రాజకీయ అనుబంధం ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సోషలిస్టు పార్టీ నేతగా సర్దార్ గౌతు లచ్చన్న ప్రజాసేవలో, నిబద్ధతలో చెరగని ముద్ర వేశారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్న గౌతు శిరీష, రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా విలువలకు కట్టుబడి బహిరంగంగా క్షమాపణ కోరడం ద్వారా పలాస రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని వ్యాఖ్యానిస్తున్నారు.

“ఆట హాస్యాస్పదంగా మారింది”..

వైభవ్ రికార్డుపై మంజ్రేకర్ సంచలన వ్యాఖ్యలు

53 బంతుల్లో 204 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ

వైభవ్ ప్రతిభను కొనియాడిన మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్

వైట్ బాల్ క్రికెట్ హాస్యాస్పద స్థితికి చేరిందంటూ కామెంట్స్

ఆట పూర్తిగా బ్యాటర్ల వైపే మొగ్గుచూపుతోందని ఆందోళన

కేవలం బ్యాటింగ్ మాత్రమే క్రికెట్ కాదంటూ ఎక్స్‌లో పోస్ట్





యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ యూఏఈపై 53 బంతుల్లోనే 204 పరుగులు బాది సృష్టించిన విధ్వంసంపై భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ అసాధారణ ప్రతిభను ప్రశంసిస్తూనే, ప్రస్తుత పరిమిత ఓవర్ల క్రికెట్ (వైట్ బాల్ క్రికెట్) ఎంత హాస్యాస్పదమైన స్థితికి చేరుకుందో చెప్పడానికి ఈ ఇన్నింగ్స్ నిదర్శనమని అభిప్రాయపడ్డాడు. ఆట పూర్తిగా బ్యాటర్ల వైపే మొగ్గుచూపుతోందని ఆందోళన వ్యక్తం చేశాడు.

దోహా వేదికగా జరిగిన ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భాగంగా భారత్-ఎ తరపున ఆడిన వైభవ్, 7 ఫోర్లు, 28 సిక్సర్లతో 384.90 స్ట్రైక్ రేట్‌తో ఈ ఘనత సాధించాడు. 28 బంతుల్లోనే సెంచరీ, 52 బంతుల్లో డబుల్ సెంచరీ చేసి లిస్ట్-ఎ చరిత్రలోనే సరికొత్త రికార్డులను నెలకొల్పిన విషయం తెలిసిందేఈ ఇన్నింగ్స్‌పై సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా స్పందించిన మంజ్రేకర్, “వైభవ్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. అందులో ఎలాంటి సందేహం లేదు.

కానీ అతడు ఆడిన ఈ ఇన్నింగ్స్ వైట్ బాల్ క్రికెట్ ఎంతటి హాస్యాస్పద దశకు చేరిందో మరోసారి గుర్తుచేసింది. అభిమానులు కోరుకునేది ఇదే అనుకోవడం పెద్ద భ్రమ. క్రికెట్ అనేది బ్యాట్, బంతి రెండింటికీ సమానమైన ఆట.. కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే కాదు” అని పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బౌలర్లకు ఎలాంటి రక్షణ లేకుండా పోతోందన్న చర్చకు మంజ్రేకర్ వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి.

ఐపీఎల్ 2027 వేలం కోసం 1,220 మంది ఆటగాళ్లతో రిజిస్టర్ విడుదల.. అందుబాటులో 66 స్లాట్లు మాత్రమే!

- **డిసెంబర్ 16న గోవాలో జరగనున్న వేలంలో 66 స్లాట్ల భర్తీ**
- **రిజిస్టర్‌లో అత్యధికంగా 994 మంది అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు**
- **లక్నో వద్ద అత్యధికంగా రూ.47.45 కోట్లు.. గుజరాత్ వద్ద అత్యల్పంగా రూ.8.75 కోట్లు**
- **ఆటగాళ్ల తుది వేలం జాబితా డిసెంబర్ 4న విడుదల**



ఐపీఎల్ 2027 సీజన్ కోసం నిర్వహించే మినీ వేలం సందడి మొదలైంది. ఈ వేలం కోసం మొత్తం 1,220 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఐపీఎల్ నిర్వాహకులు తాజాగా ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 16న గోవా వేదికగా ఈ వేలం జరగనుండగా, పది ఫ్రాంచైజీలు కేవలం 66 ఖాళీలను మాత్రమే భర్తీ చేయనున్నాయి.ఈసారి విడుదలైన ఆటగాళ్ల రిజిస్టర్‌లో 939 మంది భారత ఆటగాళ్లు, 281 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఇప్పటికే ఫ్రాంచైజీలు 184 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా, మిగిలిన 66 స్లాట్లలో గరిష్ఠంగా 25 స్థానాలను మాత్రమే విదేశీ ఆటగాళ్లతో భర్తీ చేసే అవకాశం ఉంది. ఈ జాబితాలో అన్‌క్యాప్డ్ ఆటగాళ్లదే హవా నడుస్తోంది. మొత్తం 994 మంది అన్‌క్యాప్డ్ (అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని) ఆటగాళ్లు రిజిస్టర్ చేసుకోగా, 184 మంది క్యాప్డ్ ఆటగాళ్లు, 42 మంది అసోసియేట్ దేశాల ఆటగాళ్లు ఉన్నారు.విదేశీ ఆటగాళ్లలో అత్యధికంగా ఆస్ట్రేలియా నుంచి 53 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా నుంచి 40, వెస్టిండీస్ నుంచి 36, న్యూజిలాండ్ నుంచి 25, ఆఫ్ఘనిస్థాన్ నుంచి 23, శ్రీలంక నుంచి 21 మంది ఆటగాళ్లు ఉన్నారు. అసోసియేట్ దేశాల్లో అమెరికా నుంచి అత్యధికంగా 13 మంది ఉండటం విశేషం.ప్రస్తుతం పది ఫ్రాంచైజీల వద్ద కలిపి వేలంలో ఖర్చు చేయడానికి రూ.295.60 కోట్ల పర్స్ మిగిలి ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ వద్ద అత్యధికంగా రూ.47.45 కోట్లు ఉండగా, ఆ జట్టు 7 స్లాట్లను భర్తీ చేయాల్సి ఉంది. గుజరాత్ టైటాన్స్ వద్ద అత్యల్పంగా రూ.8.75 కోట్లు మాత్రమే ఉండగా, ఆ జట్టుకు 3 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ (రూ.39.50 కోట్లు), ముంబై ఇండియన్స్ (రూ.30.25 కోట్లు) అత్యధికంగా చెరో 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.40.15 కోట్లతో ఏడుగురిని, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.14.15 కోట్లతో ఐదుగురిని తీసుకోవాల్సి ఉంది.ఫ్రాంచైజీలు ఈ రిజిస్టర్ నుంచి తమకు ఆసక్తి ఉన్న ఆటగాళ్ల జాబితాను ఐపీఎల్ నిర్వాహకులకు పంపుతాయి. ఆ తర్వాత డిసెంబర్ 4న వేలంలో పాల్గొనే ఆటగాళ్ల తుది జాబితాను విడుదల చేయనున్నారు.

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా దూకుడు.. పంత్, గిల్, జైస్వాల్ హవా.. టాప్-10లో మనోళ్ల జోరు



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత బౌలింగ్ సంచలనం జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లతో రాణించిన బుమ్రా, ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి బౌలర్ల జాబితాలో సంయుక్తంగా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇంగ్లాండ్ పేసర్ ఓలీ రాబిన్సన్‌తో కలిసి బుమ్రా రెండో స్థానంలో నిలవగా, అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ కంటే కేవలం 25 రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుకబడి ఉన్నాడు. మరోవైపు బ్యాటర్ల విభాగంలోనూ భారత ఆటగాళ్లు సత్తా చాటారు. న్యూజిలాండ్‌పై తొలి టెస్టులో 128 పరుగులతో మెరిసిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఆరో స్థానానికి చేరుకుని భారత్ తరఫున అత్యుత్తమ ర్యాంకర్‌గా నిలిచాడు. అదే మ్యాచ్‌లో 98 పరుగులు చేసిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఏడో స్థానాన్ని, 85 పరుగులు సాధించిన యశస్వి జైస్వాల్ తొమ్మిదో స్థానాన్ని నిలబెట్టుకుని టాప్-10లో కొనసాగుతున్నారు. దీంతో టాప్-10 టెస్ట్ బ్యాటర్ల జాబితాలో ముగ్గురు భారత ఆటగాళ్లు స్థానం దక్కించుకున్నారు. మిగతా భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 25వ స్థానానికి చేరుకున్నాడు. తొలి టెస్టులో 80 పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

ఇతర జట్ల విషయానికి వస్తే.. దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా మూడో స్థానానికి చేరాడు. ఎనిమిది వికెట్లతో అదరగొట్టిన పేసర్ కగిసో రబాడ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును దక్కించుకున్నాడు.

యంగ్ హీరో మేకోవర్‌పై బిగ్ డిబేట్



సముద్ర తీరంలో పాస్టెల్ పింక్ జిప్పర్ స్విమ్‌సూట్ లో మెరిసిపోతున్న మానుషి చిల్లర్







యువ నటుడు విశ్వక్ సేన్ స్లిమ్ లుక్, మేకోవర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఆయన కొత్త లుక్‌పై నెటిజన్లు మీమ్స్, సెటైరికల్ కామెంట్లతో స్పందిస్తున్నారు. కొందరు సినిమా పాత్ర కోసమే ఈ మార్పు అని భావిస్తుండగా, మరికొందరు హెయిర్ స్టైలింగ్‌పై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ‘ఇఎన్ఇ రిపీట్’ విజయం కూడా విశ్వక్ కెరీర్‌కు ఊతమిచ్చింది.స్టార్ల అధిక బరువు లేదా స్లిమ్ లుక్ గురించి మాట్లాడేందుకు అభిమానుల్లో ఆసక్తి ఉంటుంది. ఆంధ్రావాలా సినిమా సమయంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ లుక్ గురించి ఇలానే మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ అధిక బరువు నుంచి బయటపడి స్లిమ్ గా మారాక కూడా అతడి గురించి చాలా మాట్లాడుకున్నారు.

ఇప్పుడు సోషల్ మీడియాలో యువనటుడు విశ్వక్ సేన్ లుక్ – మేకోవర్ గురించి చాలా చర్చ సాగుతోంది. ఇటీవల అతడి స్లిమ్ లుక్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను చూసిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చకు తెరలేపారు. కొందరు ఇది సినిమా పాత్రల కోసం ట్రై చేసిన లుక్ అని పేర్కొంటుండగా...మరికొందరు లుక్‌లోని స్టైలింగ్, విగ్ – హెయిర్ ప్యాచ్‌పై సరదాగా.. సెటైరికల్‌గా స్పందిస్తున్నారు.కొందరు ఇది –గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి– తరహా లుక్‌లా ఉందని ... తొలుత చూసి బాలకృష్ణ ఏమో అనుకున్నానని రకరకాల కామెంట్లు చేసారు. మరోవైపు ఇలా సన్నగా లేదా భిన్నంగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయితే ఇంట్లో వాళ్లు, బంధువులు --ఏరా చిక్కిపోయావ్.. డైట్ ఆ, డబ్బులు దాచి పెడుతున్నావా?-- అంటూ వేసే ప్రశ్నలపై ఒక నెటిజన్ ఫన్నీ కామెంట్ నెట్టింట నవ్వులు పూయిస్తోంది.సినీ నటుల మేకోవర్‌లు, గెటప్ మార్పులపై సోషల్ మీడియాలో ఎప్పటిలాగే మీమ్స్, సెటైర్లు, విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. సినిమా ప్రాజెక్టుల కోసమే ఇలాంటి లుక్స్ ట్రై చేస్తారని కొందరు సమర్థిస్తుండగా.. నెటిజన్ల ఫన్నీ రియాక్షన్లు ఈ ట్రెండ్‌ను మరింత వైరల్‌గా మార్చాయి. విశ్వక్ సేన్ నటించిన తాజా చిత్రం ఇఎన్ఇ రిపీట్ ఇటీవల విడుదలై హిట్ కొట్టింది.

అతడి కెరీర్ కి ఇది బిగ్ బూస్ట్ అని చెప్పాలి. యువహీరో నటిస్తున్న ఇతర ప్రాజెక్టులకు ఈ విజయం ఆయువుగా ఉపయోగపడుతుంది.

సిద్ధి ఇద్నాని బ్రీజీ మూవ్ డ్రెస్ పర్ఫెక్ట్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D.No:10-11G-60/1, Flat No.4, Keelapatla Road Cross, Bangalore ByPass Road,Gangavaram MDL,Palamaneru Chittoor Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. " APTEL/25/A4274 " e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965